


VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

నిజమైన వార్తలు • నిష్పక్షపాత విశ్లేషణ • ప్రజల పక్షాన అక్షరం

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 07 | ఆదివారం 7 జూన్, 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## ఇరాన్ డ్రోన్ల కూల్చివేత..
## రాడార్ సైట్ల పై బాంబుల వర్షం..

జూన్ 6 వార్త సాక్ష్యం

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మళ్లీ ముసురుతున్నాయి. హోర్ముజ్ జలసంధి లక్ష్యంగా ఇరాన్ ప్రయోగించిన నాలుగు డ్రోన్లను అమెరికా సైన్యం కూల్చివేసింది. దీనికి ప్రతీకారంగా, ఇరాన్ తీరప్రాంతంలోని నిఘా రాడార్ కేంద్రాల పై అమెరికా వైమానిక దాడులకు దిగింది. ఈ పరిణామం ఇరు - మిగతా2లో



## భారత్ పై ఆంక్షల బెదిరింపులు
## మొదటికే మోసం తెస్తాయి: పుతిన్

జూన్ 6 వార్త సాక్ష్యం

భారతదేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గట్టి మద్దతు తెలిపారు. ఆంక్షల ద్వారా భారత్ పై ఒత్తిడి తెచ్చే ఏ ప్రయత్నమైనా తిరగబెడుతుందని ఆయన అన్నారు. సార్వభౌమ దేశాలు తమ రక్షణ, ఆర్థిక భాగస్వాములను ఎంచుకునే స్వేచ్ఛను కలిగి ఉండాలని - మిగతా2లో



# నిరుద్యోగులకు శుభవార్త..
## టీజీపీఎస్సీ నుంచి మరో ఉద్యోగ ప్రకటన

- విద్యాశాఖలో డీవైఈవో, గెజిటెడ్ హెడ్‌మాస్టర్ పోస్టుల భర్తీ
- మొత్తం 24 ఉన్నత స్థాయి పోస్టులకు టీజీపీఎస్సీ నోటిఫికేషన్
- జూన్ 12 నుంచి జులై 19 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- పునర్వ్యవస్థీకరణ తర్వాత నియామక ప్రక్రియను వేగవంతం చేసిన కమిషన్




జూన్ 6 వార్త సాక్ష్యం

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) వరుసగా శుభవార్తలు అందిస్తోంది. కమిషన్ పునర్వ్యవస్థీకరణ తర్వాత నియామక ప్రక్రియలో స్పష్టమైన వేగం కనబరుస్తూ, కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే రెండో కీలక ఉద్యోగ ప్రకటనను జారీ చేసింది. రాష్ట్ర విద్యాశాఖలో పరిపాలన, పర్యవేక్షణను బలోపేతం చేసే లక్ష్యంతో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ (డీవైఈవో), గెజిటెడ్ హెడ్ మాస్టర్ గ్రేడ్-1 పోస్టుల భర్తీకి అధికారికంగా నోటిఫికేషన్ - మిగతా2లో

## ఫోన్ ట్యాపింగ్ నిందితులకు శిక్ష పడాల్సిందే:
## ఎంపీ చామల కిరణ్ కుమార్



జూన్ 6 వార్త సాక్ష్యం

ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ఎదుట భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కిరణ్ స్టేట్‌మెంట్‌ను సిట్ అధికారులు రికార్డ్ చేశారు. గతంలో చామల ఫోన్ ట్యాప్ అయినట్లు సిట్ గుర్తించింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వ్యూహరచనలో కిరణ్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఎన్నికల వ్యూహాలను పసిగట్టేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం - మిగతా2లో

## తెలంగాణలో భారీ వర్షాల హెచ్చరిక..
## సీఎస్ కీలక ఆదేశాలు



జూన్ 6 వార్త సాక్ష్యం

తెలంగాణలో వర్షాల హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు శనివారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాల పై దిశానిర్దేశం చేశారు. - మిగతా2లో

## ఆ పనుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు..
## మంత్రి సీతక్క వార్నింగ్



జూన్ 6 వార్త సాక్ష్యం

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సర్ అధికారులతో మంత్రి సీతక్క శనివారం సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. మహిళా భవనాల నిర్మాణ పురోగతిని రోజూ పరిశీలిస్తామని తెలిపారు. - మిగతా2లో

## 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్
## విధించిన ఉప్పల్ కోర్టు



జూన్ 6 వార్త సాక్ష్యం

సైబరాబాద్ పరిధిలోని గండిపేటలో వెలుగుచూసిన రూ.1,500 కోట్ల రూపాయల భూకుంభకోణం కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడికి న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. తమిళనాడులో అరెస్టయిన ఆయనను పోలీసులు - మిగతా2లో

## నూతన పట్టాదారు పాసుపుస్తకాలతో
## భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

జూన్ 6 వార్త సాక్ష్యం

రైతుల హక్కులు రక్షించేందుకు ప్రభుత్వం రీ-సర్వే 2.0 చేపట్టిందని నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయ సూర్య పేర్కొన్నారు. శనివారం మిడ్తూరు మండల పరిధిలోని చెరుకుచెర్ల గ్రామంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన "మీ భూమిమీ హక్కు" కార్యక్రమంలో - మిగతా2లో



## టీచర్లు లేని స్కూల్, స్మార్ట్ ట్రాఫిక్: ఏపీ
## కోసం రష్యాలో నారా లోకేష్ కీలక భేటీలు

జూన్ 6 వార్త సాక్ష్యం

"సంక్షోభంలోనూ అవకాశాలను సృష్టించడమే అసలైన నాయకత్వం ఆంధ్రప్రదేశ్ యువతకు ఉజ్వల భవిష్యత్తును అందించే అవకాశాలను సృష్టించేందుకే నేను రష్యాలో పర్యటిస్తున్నాను," అని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం - మిగతా2లో



VARTHAA SAKSHAMU వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక


# నిరుద్యోగులకు శుభవార్త.. టీజీపీఎస్సీ నుంచి మరో ఉద్యోగ ప్రకటన

-మొదటిపేజీ తరువాయి

విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 24 గెజిటెడ్ స్థాయి పోస్టులను భర్తీ చేయనున్నట్లు టీజీపీఎస్సీ ప్రకటించింది. చాలాకాలంగా ఖాళీగా ఉన్న ఈ ఉన్నత స్థాయి పోస్టులను భర్తీ చేయడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, విద్యా సంస్థల పనితీరును మెరుగుపరచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నియామకాలు విద్యా వ్యవస్థలో క్షేత్రస్థాయి పర్యవేక్షణను పటిష్ఠం చేయడానికి దోహదపడతాయని నిపుణులు భావిస్తున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల అర్హతలకు సంబంధించి కమిషన్ స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. 2026 జులై 1 నాటికి అభ్యర్థుల వయస్సు తప్పనిసరిగా 18 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితిని 44 ఏళ్లుగా నిర్ణయించారు. అయితే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు వయోపరిమితిలో సడలింపులు వర్తిస్తాయని కమిషన్ స్పష్టం చేసింది. ఈ సడలింపుల వల్ల సీనియర్ అభ్యర్థులకు సైతం దరఖాస్తు చేసుకునేందుకు మంచి అవకాశం లభించనుంది. అర్హులైన అభ్యర్థులు జూన్ 12వ తేదీ నుంచి ఆన్‌లైన్ విధానంలో తమ దరఖాస్తులను సమర్పించ వచ్చు. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీగా జులై 19ని నిర్ణయించారు. చివరి నిమిషంలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు అభ్యర్థులు గడువు తేదీలోగా ముందే దరఖాస్తు చేసుకోవడం మంచిదని కమిషన్ సూచించింది. ఈ పోస్టులకు సంబంధించిన పూర్తి వివరాలు, విద్యా అర్హతలు, పరీక్షా విధానం, సిలబస్, జిల్లాల వారీగా ఖాళీల కేటాయింపు, దరఖాస్తు రుసుము వంటి సమగ్ర సమాచారం కోసం అభ్యర్థులు టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ tgpsc.gov.in ను సంప్రదించాలని కమిషన్ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమయ్యే నాటికి వెబ్‌సైట్‌లో పూర్తిస్థాయి నోటిఫికేషన్ పీడీఎఫ్‌ను అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ నిందితులకు శిక్ష పడాల్సిందే: ఎంపీ చామల కిరణ్ కుమార్

-మొదటిపేజీ తరువాయి

వారి ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సిట్ విచారణ అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ.. సిట్ ఈరోజు తనను బాధితుడిగా విచారణకు పిలిచిందని అన్నారు. తాను మీడియా కమిటీ చైర్మన్‌గా ఉన్న సమయంలో ఫోన్ ట్యాప్ అయ్యిందని సిట్ అధికారులు చెప్పారని ఎంపీ తెలిపారు. ఆనాడు బీఆర్ఎస్ సొంత పార్టీ మంత్రుల ఫోన్‌లు కూడా ట్యాప్ చేసినట్లు తెలిపారు. 'జులై 30న నా ఫోన్ ట్యాప్ అయినట్లు సిట్ గుర్తించింది. జులై 30 నుంచి అసెంబ్లీ ఎన్నికల వరకు నా ఫోన్ ట్యాప్ అయింది' అని ఎంపీ వెల్లడించారు. నిజాం పాలనలో నిజాం రాజు.. రజాకార్ల పై కూడా ఇంతలా నిఘా పెట్టి వేధించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తన ఐఫోన్‌కి అలర్ట్ వచ్చిందని.. అయితే అది నార్మల్‌గా వచ్చే అలర్ట్ అని భావించినట్లు చెప్పారు. ఎన్నికల ప్రచారంలో పార్టీ ముఖ్య నేతలతో మాట్లాడే విషయాలన్నీ తెలుసుకునేవారన్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి వేరే పార్టీకి వెళ్లే వాళ్లని ముందుగానే గుర్తించి బెదిరింపులకి పాల్పడినట్లు ఆరోపించారు. తన ఫోన్ మాత్రమే కాదని... హరీశ్ రావు ఫోన్ కూడా ట్యాప్ చేశారంటూ చామల సంచలన వ్యాఖ్యలు చేశారు. ట్యాపింగ్ విషయం బీఆర్ఎస్ నేతలకు కూడా తెలుసన్నారు. సొంత పార్టీ నేతల ఫోన్‌లను కూడా కేసీఆర్ ట్యాపింగ్ చేయించారని.. అధికారం కోసం కేసీఆర్ ఏమైనా చేస్తారని దుయ్యబట్టారు. అందులో భాగంగానే ప్రతిపక్ష నేతలు, కాంగ్రెస్ నేతల ఫోన్లు ట్యాప్ చేయించారన్నారు. ఫోన్ ట్యాప్ నిందితులకు శిక్ష పడుతుందని భావిస్తున్నట్లు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# ఇరాన్ డ్రోన్ల కూల్చివేత.. రాడార్ సైట్ల పై బాంబుల వర్షం..

-మొదటిపేజీ తరువాయి

దేశాల మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణను తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు ఇరాన్ డ్రోన్ల వల్ల తక్షణ ముప్పు పొంచి ఉందని అమెరికా సెంట్రల్ కమాండ్ (జజుచీజూవీ) స్పష్టం చేసింది. ఆత్మరక్షణ చర్యల్లో భాగంగానే జలసంధిలోని ఒక ద్వీపంతో పాటు ఇరాన్ తీరంలోని కీలక రాడార్ సైట్‌లపై తాము దాడులు చేసినట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. మరోవైపు, ప్రపంచ ఇంధన సరఫరాకు గుండెకాయ లాంటి హోర్ముజ్ జలసంధిపై పట్టు సాధించేందుకు ఇరాన్ ప్రయత్నిస్తుండగా, అందుకు ప్రతిగా అమెరికా ఇరాన్ రేవులపై ఆంక్షలు, దిగ్బంధనాన్ని విధిస్తోంది. ఈ వారంలోనే కువైట్ ప్రధాన విమానాశ్రయంలోని ప్యాసింజర్ టెర్మినల్‌పై ఇరాన్ డ్రోన్లు దాడి చేశాయి. ఈ ఘటనలో ఒకరు మరణించగా, డజన్ల కొద్దీ ప్రయాణికులు గాయపడ్డారు. దీనివల్ల ఎయిర్‌ఫీల్డ్ తాత్కాలికంగా మూతపడింది. ఈ దాడితో తీవ్ర ఆగ్రహానికి గురైన అమెరికా, తాజా ఘర్షణతో ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు పంపింది. రాడార్ సైట్‌లపై దాడులతో పాటు, హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తున్న ఇరాన్ లింక్డ్ చమురు ట్యాంకర్‌ను అమెరికా సైన్యం తమ ఆధీనంలోకి తీసుకుంది. ఆంక్షల పరిధిలో ఉన్న చమురును విక్రయించడం ద్వారా ఇరాన్ లాభపడకుండా అడ్డుకునేందుకు అమెరికా ఈ చర్య చేపట్టింది. అలాగే, ఇరాన్ ఇంధన రంగానికి సహాయం చేస్తున్న పలువురు వ్యక్తులు, సంస్థలు, ట్యాంకర్ల పై అమెరికా కొత్తగా మరికొన్ని ఆర్థిక ఆంక్షలను విధించింది.

### లెబనాన్ సరిహద్దుల్లోనూ రాజుకున్న మంటలు

ఇరాన్-అమెరికా ఘర్షణ కేవలం జలసంధికే పరిమితం కాలేదు. అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, లెబనాన్ ప్రభుత్వాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ మద్దతున్న హెజ్‌బొల్లా ఉగ్రవాద సంస్థ తిరస్కరించింది. ఈ క్రమంలో శుక్రవారం ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ లెబనాన్‌లోని ఎక్కువ భాగాన్ని ఇజ్రాయెల్ ఇప్పటికే తన ఆధీనంలోకి తెచ్చుకుంది. మరోవైపు, హోర్ముజ్ జలసంధి తెరవాలన్నా, శాశ్వత కాల్పుల విరమణ కుదరాలన్నా లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు ఆగాలని ఇరాన్ పట్టుబడుతోంది.

# తెలంగాణలో భారీ వర్షాల హెచ్చరిక.. సీఎస్ కీలక ఆదేశాలు

-మొదటిపేజీ తరువాయి

ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా వర్షాల పరిస్థితులు, వరి కొనుగోళ్లు, ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనల ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో వర్షాల ప్రభావంపై ప్రత్యేకంగా చర్చించిన సీఎస్, అన్ని జిల్లాల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

### రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలి..

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించేలా అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న వరి కొనుగోళ్లను వేగవంతం చేసి, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు.

### సమన్వయంతో పనిచేయాలి..

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని జిల్లా యంత్రాంగానికి సీఎస్ సూచించారు. వర్షాల పరిస్థితులపై నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేలా అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వర్షాల హెచ్చరికలు, వరి కొనుగోళ్లు, సీఎం పర్యటనల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. రైతులకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### సీఎం జిల్లాల పర్యటనల ఏర్పాట్ల పై చర్చ..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనల ఏర్పాట్లపైనా సీఎస్ అధికారులతో చర్చించారు. సీఎం పర్యటనలు విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లు, ప్రజాసభల నిర్వహణ, రవాణా సౌకర్యాలు, వసతి ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు.

# టీచర్లు లేని స్కూల్, స్మార్ట్ ట్రాఫిక్: ఏపీ కోసం రష్యాలో నారా లోకేష్ కీలక భేటీలు

-మొదటిపేజీ తరువాయి

తన రష్యా పర్యటనలో ఐదో రోజు ఆయన మాస్కోలో ప్రవాస భారతీయులతో సమావేశమయ్యారు. పెట్టుబడుల ఆకర్షణ, వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏపీకి తీసుకురావడమే లక్ష్యంగా పలు సంస్థల ప్రతినిధులతో వరుస భేటీలు నిర్వహించారు. మాస్కోలోని భారత రాయబార కార్యాలయంలో జరిగిన ప్రవాస భారతీయుల (డయాస్పోరా) సమావేశంలో లోకేష్ ఉద్విగ్నభరితంగా ప్రసంగించారు. "మీరు భారతదేశాన్ని విడిచి వచ్చినా, భారతదేశం మిమ్మల్ని ఎప్పటికీ విడిచిపెట్టదు. మాతృభూమికి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నా, మన సంస్కృతి, సంప్రదాయాలను గుండెల్లో మోస్తున్న మీ విజయాలు దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తున్నాయి" అని ఆయన ప్రశంసించారు. భారత్-రష్యా బంధం అత్యంత విశ్వసనీయమైనదని, ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ నాయకత్వంలో ఈ స్నేహం మరింత బలపడిందని అన్నారు. అంతర్జాతీయ వేదికపై ప్రధాని మోదీ దేశ కీర్తిప్రతిష్ఠలను చారిత్రక శిఖరాలకు చేర్చారని కొనియాడారు.

### అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కండి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని లోకేష్ వివరించారు. "యువ జనాభా, సుదీర్ఘ తీరప్రాంతం, ఆధునిక ఓడరేవులు మన బలం. పెట్టుబడులను ఆకర్షించి, వాటిని యువతకు ఉపాధిగా మార్చడమే మా ప్రభుత్వ లక్ష్యం," అని ఆయన తెలిపారు. గత రెండేళ్లలో ఏపీ పెట్టుబడులకు స్వర్గధామంగా మారిందని, రెన్యూవబుల్ ఎనర్జీ నుంచి ఏరోస్పేస్ వరకు అనేక రంగాల్లో పెట్టుబడులు వస్తున్నాయని పేర్కొన్నారు. "మీరంతా ఏపీకి బ్రాండ్ అంబాసిడర్లుగా మారి, రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలి. ఒక్క పెట్టుబడి తీసుకురండి, యువతకు ఉద్యోగాలివ్వండి. మీకు ఏ సమస్య వచ్చినా ఏపీఎన్నార్టీ అండగా ఉంటుంది, ఆ బాధ్యత నాది," అని లోకేష్ భరోసా ఇచ్చారు. బలమైన భారత్ కోసం 'నమో' (నరేంద్ర మోదీ) అయితే, బలమైన ఆంధ్రప్రదేశ్ కోసం 'నమో' (నాయుడు-మోదీ) కలయిక పనిచేస్తోందని ఆయన అభివర్ణించారు. పర్యటనలో భాగంగా, రష్యాకు చెందిన ప్రముఖ టెక్నాలజీ సంస్థ యాండెక్స్ (ఖఅుఎవ×) ఉన్నతస్థాయి ప్రతినిధులతో లోకేష్ సమావేశమయ్యారు. అమరావతి, విశాఖపట్నం నగరాల్లో స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, ప్రిడిక్టివ్ ట్రాన్సిట్ షెడ్యూలింగ్, కంప్యూటరైజ్డ్ పబ్లిక్ సేఫ్టీ అనలిటిక్స్ అమలుపై చర్చించారు. లాస్ట్-మైల్ రవాణా ఖర్చులను తగ్గించేందుకు యాండెక్స్ అటానమస్ వాహనాలు, ప్రిడిక్టివ్ రూటింగ్ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించుకునే అవకాశాలను అధ్యయనం చేయాలని సూచించారు.

## భారత్ పై ఆంక్షల బెదిరింపులు మొదటి కే మోసం తెస్తాయి: పుతిన్

-మొదటిపేజీ తరువాయి

శుక్రవారం పుతిన్.. సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక వేదికలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యాతో సంబంధాలపై బాహ్య ఒత్తిడి ఉన్నప్పటికీ, భారత్ తన జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగానే స్థిరంగా వ్యవహరించిందని, భవిష్యత్తులో కూడా అలాగే కొనసాగిస్తుందని పుతిన్ అన్నారు. 'భారత్ ఎల్లప్పుడూ ఒక సార్వభౌమ దేశంగానే వ్యవహరిస్తుంది. ప్రధాని మోదీ నాయకత్వంలో, ఆంక్షల రూపంలో వచ్చే ఎలాంటి బెదిరింపులైనా తక్షణమే తిరగబెడతాయి' అని పుతిన్ పేర్కొన్నారు. భారతదేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని నొక్కిచెబుతూ, పుతిన్ 'భారతదేశం ఒక సార్వభౌమ దేశం, తమకు అత్యంత ఆధునికమైనవిగా, అత్యంత అనువైనవిగా భావించే ఉత్పత్తులను ఎంచుకోవడానికి దానికి స్వేచ్ఛ ఉంది. ఎవరు ఎలాంటి ఆంక్షలు విధించినా సరే, భారతదేశం ఎల్లప్పుడూ ఈ విధంగానే వ్యవహరిస్తుంది' అని స్పష్టం చేశారు. Su-57 లేదా S-500 వంటి ఫైటర్ జెట్లను భారత్ కొనుగోలు చేస్తే, అమెరికా నుంచి ఆంక్షల ఒత్తిడిని ఎదుర్కొనే అవకాశం ఉందన్న విషయంపై పుతిన్ పై విధంగా స్పందించారు. అంతేకాదు.. భారత్‌కు అది అందజేయవద్దని కూడా మమ్మల్ని ఎవరూ ఆదేశించలేరని పుతిన్ తేల్చి చెప్పారు. న్యూఢిల్లీతో కుదిరిన ఒప్పందాలకు రష్యా కట్టుబడి ఉంటుందని ఆయన అన్నారు.

## ఆ పనుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు.. మంత్రి సీతక్క వార్నింగ్

-మొదటిపేజీ తరువాయి

మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. 8వేల గ్రామాల్లో మహిళా భవనాల నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. ఇవి మహిళల ఆత్మగౌరవ భవనాలని మంత్రి సీతక్క అభివర్ణించారు. ఈ నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. ఎంపీడీవోలు ఈ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత, పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులు నిరంతర పర్యవేక్షించాలని దిశానిర్దేశం చేశారు. ఉపాధి హామీ పనుల అమలుపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. గ్రామీణాభివృద్ధి పనుల్లో లక్ష్యాల సాధించాలని అధికారులకు.. మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు.

## 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించిన ఉప్పల్ కోర్టు

-మొదటిపేజీ తరువాయి

శనివారం హైదరాబాద్‌లోని ఉప్పల్ కోర్టులో హాజరుపరిచారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేయడంతో, పోలీసులు ఆయనను చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ కేసు వెలుగుచూసినప్పటి నుంచి పరారీలో ఉన్న బ్రహ్మనాయుడిని సైబరాబాద్ పోలీసులు శుక్రవారం తమిళనాడులోని కాంచీపురంలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ట్రాన్సిట్ వారెంట్‌పై హైదరాబాద్‌కు తరలించి, నార్సింగి పోలీస్ స్టేషన్‌లో విచారణ చేపట్టారు. ఈ క్రమంలో ఆయన అనుచరులు, వైసీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్‌కు చేరుకోవడంతో అక్కడ కొంత సమయం పాటు ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత నడుమ బ్రహ్మనాయుడిని కోర్టుకు తరలించారు. రంగారెడ్డి జిల్లా గండిపేటలోని సర్వే నంబర్ 18లో గల సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు బ్రహ్మనాయుడు మరికొందరితో కలిసి కుట్ర పన్నారని గండిపేట తహసీల్దార్ ఎన్. శ్రీనివాస్ రెడ్డి మే 23న నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులు నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు (జీవోలు), రెవెన్యూ రికార్డులను సృష్టించి,ఆ భూమిని ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నించారని పోలీసులు దర్యాప్తులో వెల్లడైంది. ఈ భూమి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ. 1,500 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా వినుకొండ మాజీ ఎమ్మెల్యే అయిన బ్రహ్మనాయుడు, ఈ కేసులో అరెస్టు కాకుండా ఉండేందుకు ముందస్తు బెయిల్ కోసం గతంలో హైకోర్టును ఆశ్రయించారు.

## నూతన పట్టాదారు పాసుపుస్తకాలతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

-మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్యే గిత్త జయసూర్య హాజరయ్యారు. ముందుగా గ్రామ నాయకులు మండలాధికారులు ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికారు అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రభుత్వ రాజ్యముద్రతో కూడిన 550 పట్టాదారు పాసు పుస్తకాల ను అధికారులు, కూటమి నేతలతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ, భూమి పై రైతులకు సంపూర్ణ హక్కులు కల్పించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం "మీ భూమిమీ హక్కు" కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి పాస్ పుస్తకాలను తయారు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ రాజ్యముద్రతో జారీ చేసిన పాసు పుస్తకాల వల్ల రైతులకు బ్యాంకు రుణాలు, వ్యవసాయ పెట్టుబడులు సులభంగా లభిస్తాయన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రైతుల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పట్టాదారు పాసు పుస్తకాలు అందుకున్న రైతులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే గిత్త జయసూర్యకి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అంగన్వాడి సెంటర్ ఆకస్మిక తనిఖీ చేసి ఆహారం పోషణ అందించే పౌష్టికాహారం నాణ్యత, స్టాక్ నిల్వలు పరిశుభ్రత సెంటర్ పరిసరాలు మరియు వంటగది పరిశుభ్రతను ఎమ్మెల్యే గిత్త జయసూర్య తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు సర్వోత్తమ్, నందికొట్కూరు మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి మిడ్తూరు మండల కన్వీనర్ ఖాతా రమేష్ రెడ్డి, శివరామరెడ్డి, స్వామిరెడ్డి, సుధాకర్ యాదవ్, రైతులు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
ఆదివారం 7 జూన్, 2026

# సాంస్కృతిక కార్యక్రమాలు







శ్రీశైలం జూన్ 6 వార్త సాక్ష్యం

శనివారం శ్రీశైల దేవస్థానశీ పరిధిలో నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమం శ్రీ నటరాజ కూచిపూడి నాట్యాలయం, పొదిలి వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేశారు ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద సాయంకాలం నుండి ఈ నృత్య ప్రదర్శన ఈ కార్యక్రమములో వినాయక ప్రార్థన, ఓం నమ:శివాయ, నమశ్శివాయతే, లింగాష్టకం తదితర గీతాలకు భవిత, శ్రీహర్షిణి, ధరణి, మానస, కుందన, వాత్సల్య, బిల్వనాథ్, తేజస్వి, లక్ష్మి, వరలక్ష్మీ తదితరులు నృత్యప్రదర్శన చేపట్టారు. ఈ నిత్య కళారాధనలో ఆయా రోజులలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీ స్వామి అమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించారు.

# పర్యావరణ పరిరక్షణ బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలి

- ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ బేబీ,
- పర్యావరణం కాపాడడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి
- ఆత్మకూరు సింగల్ విండో చైర్మన్ ఎ. షహబుద్దిన్
- పర్యావరణాన్ని పరిరక్షణ చేద్దాం పచ్చదనంతో మొక్కలు నాటుదాం
- టిడిపి పార్టీ 11వ వార్డు అధ్యక్షుడు అమృల్లా





ఆత్మకూరు జూన్ 6 వార్త సాక్ష్యం

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని 11వ వార్డు లో టిడిపి వార్డు అధ్యక్షులు అమృల్లా ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమిషనర్ బేబీ, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు వేణుగోపాల్ సింగిల్ విండో చైర్మన్ ఎ. షహబుద్దిన్. మొక్కలు నాటారు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ముఖ్య అతిథులు మాట్లాడుతూ మనం వాడే ప్లాస్టిక్, రసాయన పదార్థాల వలన పర్యావరణం కలుషితమై యావత్ ప్రపంచమే ప్రమాదంలో ఉందని కావున ప్రతి ఒక్కరూ చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏ ఈ షాహిర్, శానిటరీ ఇన్స్పెక్టర్ జీవన్ కుమార్, తెలుగుదేశం పార్టీ నాయకులు మున్నా ,నబి రసూల్, షఫీ అహ్మద్, సుబ్బరాయుడు, సయ్యిద్, ఇర్ఫాన్ ,భాష ,మాలిక్ ,రిటైర్డ్ టీచర్ అబ్దుల్ వహీద్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజా సంఘాల పోరాటమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల స్పందన.!

- టి యు సి ఐ

సున్నిపెంట జూన్ 6 వార్త సాక్ష్యం



శ్రీశైలం మండల పరిధిలోని సున్నిపెంట గ్రామంలో టి యు సి ఐ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు వై ఆశీర్వాదం ఆధ్వర్యంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దోర్నాల శ్రీశైలం నల్లమల్ల ఘాట్ రోడ్డు విస్తరణ కోసం దాదాపు

నల్లమలలో రూ.18 వేల కోట్లతో టైగర్ ఎలివేటెడ్ కారిడార్.

నల్లమల అటవీ ప్రాంతంలో పులులు, ఇతర వన్యప్రాణుల సంచారానికి ఆటంకం కలగకుండా భారీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. సుమారు రూ.18 వేల కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదిత ఈ ప్రాజెక్టు ద్వారా రహదారి రవాణా కొనసాగుతూనే, వన్యప్రాణుల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అటవీ పర్యావరణ సమతుల్యతను కాపాడడం, రోడ్డు ప్రమాదాలను తగ్గించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యాలుగా అధికారులు పేర్కొంటున్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన తుది అనుమతులు, సాంకేతిక అంశాల పై పరిశీలనలు కొనసాగుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తూ, నియోజకవర్గ ఎమ్మెల్యే. నంద్యాల ఎంపీ. జిల్లా కలెక్టర్లు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు, ప్రజా ప్రతినిధులకు. కార్మిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. మీడియా పత్రిక వారి సహకారంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నల్లమల్ల ఘాట్ రోడ్డు విస్తరణ పనులకు అనుమతి ఇచ్చింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అటవీశాఖ మంత్రులు, రోడ్డు విస్తరణ కోసం అనుమతులు ఇప్పించేలా చూడాలని ఫారెస్ట్ పి, సి సి ఎఫ్డి.ఆ జిల్లాలకు సంబంధించిన డి, ఎఫ్ ఓలకు అనుమతులు ఇచ్చేలా చూడాలని, కార్మిక ప్రజా సంఘాల తరపున కోరడమైనది. ఈ సమావేశంలో టి యు సి నాయకులు వై, శీను. మల్లికార్జున. షేక్షావలి. కే, వెంకటేశం. శీను. బాబు. కొమరం భీం ఆదివాసి చెంచు గిరిజన సంక్షేమ సంఘం తోకల కామేశ్వరి. పార్వతి. లక్ష్మి. మల్లమ్మ. వీరమ్మ. అంకమ్మ. అంజమ్మ. తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో యోగా ఆంధ్ర కార్యక్రమాల పై సమీక్షా సమావేశం





శ్రీశైలం జూన్ 6 వార్త సాక్ష్యం

శ్రీశైల దేవస్థానంలో కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కార్యాలయ భవనంలో జరిగిన పలు అంశాలను చర్చించారు అనంతరం కార్యనిర్వాహక అధికారి ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమాన్ని దేవస్థానం పరిధిలో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్లుగా ఈ నెల 8వ తేదీన గంగాధర మండపం వద్ద జరిగే యోగాంధ్ర కార్యక్రమానికి ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్నీ ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా అంతర్జాతీయ యోగాదినోత్సవం సందర్భంగా జూన్ 21వ తేదీన జరగనున్న అంతర్జాతీయ యోగాదినోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లన్నీ సమగ్రంగా ఉండాలన్నారు. యోగా శిక్షణా కార్యక్రమాన్ని 20వ తేదీ వరకు కూడా ప్రతీరోజు నిర్వహించాలన్నారు. యోగా కార్యక్రమాన్ని ప్రణాళికబద్ధంగా, సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. ఈ యోగా కార్యక్రమాలలో స్థానికులతో పాటు యాత్రికులను కూడా భాగస్వాములను చేయాలన్నారు. అనంతరం రానున్న వర్షాకాలం సందర్భంగా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా డార్మిటరీలు, అన్ని భవనాలలోనూ ఎలక్ట్రికల్ వైరింగ్ పనులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. షార్టు సర్క్యూట్ జరగకుండా ఉండేందుకు తరుచుగా ఎలక్ట్రికల్ వైరింగ్ పనులను తనిఖీ చేస్తుండాలన్నారు. అన్నీ డార్మిటరీలలో కూడా విద్యుద్దీపాలు మరియు ఫ్యాన్లు సజావుగా పనిచేసేలా తగు చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. డార్మిటరీ పరిసరాలలో పారిశుద్ధ్య నిర్వహణ సజావుగా ఉండాలన్నారు. పరిసరాలలో చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రతాచర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా పిచ్చిమొక్కలు తొలగించేందుకు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలన్నారు. అదేవిధంగా అన్ని డార్మిటరీలలో కూడా అన్నీ మరమ్మతులు చేపట్టాలన్నారు. శౌచాలయాల శుభ్రత పట్ల నిరంతరం శ్రద్ధవహిస్తుండాలన్నారు. ఈ సమావేశంలో దేవస్థానం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో ప్రారంభమైన యోగా శిక్షణా కార్యక్రమలు





శ్రీశైలం జూన్ 6 వార్తా సాక్ష్యం

శ్రీశైల దేవస్థానం యోగాంధ్ర కార్యక్రమమలు శనివారం యోగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు శ్రీశైలం దేవస్థానం కార్య నిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు పర్యవేక్షణలో చంద్రవతి కల్యాణమండపంలో శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈనెల 8వ తేదీన ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహింపబడుతుందన్నారు. ఈ యోగా కార్యక్రమానికి ముందస్తుగా శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గంగాధర మండపం దగ్గర ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి గంగాధర మండపం నుండి నందిమండపం వరకు చేయబడుతున్నాయన్నారు. జూన్ 21వ తేదీన జరుపనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఇందుకు ముందస్తుగా జూన్ 20వ తేదీన చంద్రవతి కల్యాణ మండపంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. యోగా కార్యక్రమాలకు ఒంగోలుకు చెందిన ప్రముఖ యోగా గురువు యోగాచార్య గంధవళ్ళ బాల సుబ్రహ్మణ్యం బృందాన్ని ఆహ్వానించడం జరిగిందన్నారు. స్థానికులు మరియు యాత్రికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని యోగా కార్యక్రమములో పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. ఈ యోగా శిక్షణా కార్యక్రమములో ముందుగా యోగాచార్య గంధవళ్ళ బాలసుబ్రహ్మణ్యం, మాట్లాడుతూ యోగాప్రాశస్త్యాన్ని అందరిచేత ధ్యానం చేయించారు. తరువాత అందరి చేత సూక్ష్మవ్యాయమాన్ని చేయించడం జరిగింది. ఆ తరువాత ప్రాణాయామాలు చేయించారు. తరువాత పలు యోగాసనాలు చేయించారు. ఈ నాటి శిక్షణా కార్యక్రమానికి దేవస్థానం సిబ్బందితో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన శివసేవకులు కూడా పాల్గొన్నారు. సుమారు 500 మంది ఈ శిక్షణా కార్యక్రమములో పాల్గొన్నారు.

# శ్రీశైల దేవస్థాన అన్న ప్రసాద వితరణకు దాతల విరాళం

శ్రీశైలం జూన్ 6 వార్తా సాక్ష్యం



శనివారం శ్రీశైల దేవస్థానంలో అన్న ప్రసాద వితరణకు, సూర్యా కామేశ్వరరావు, హైదరాబాద్ చెందిన కుటుంబ సభ్యులు రూ“ 1,01,116/- లను పర్యవేక్షకులు కే, అయ్యన్నకు ఈ విరాళాన్ని అందజేశారు. దాతకు తగు రసీదు, ప్రసాదాలు, శేష వస్త్రం పంపిణీ చేయడం జరిగిందన్నారు.

# ప్రతి వాహనదారునికి తప్పనిసరిగా లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలి

- సెల్ ఫోను మద్యం సేవించి వాహనాలు నడుపుతే కేసులు తప్పవు
- మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు
- రోడ్డు ప్రమాదాల నివారించే విధంగా వాహనాలు నడపాలి
- అతివేగంగా వాహనాలను నడిపితే ప్రాణానికే ప్రమాదం
- ఆత్మకూరు ఎస్సై డి.వి నారాయణరెడ్డి

ఆత్మకూరు జూన్ 6 వార్త సాక్ష్యం



మద్యం సేవించి సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపితే కఠినమైన చర్యలు తీసుకోక తప్పదని ఆత్మకూరు ఎస్సై డి. వెంకటనారాయణ రెడ్డి తెలిపారు శనివారం పట్టణంలోని కర్నూలు- గుంటూరు జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలను చేపట్టారు ఈ సందర్భంగా ఎస్సై నారాయణరెడ్డి మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ ఐపీఎస్ ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజనల్ అధికారి ఆర్. రామాంజి నాయక్, అర్బన్ సీఐ ఓ. మహేశ్వర్ రెడ్డి ఆదేశాలతో వాహనాలు తనిఖీలు చేయడం జరిగిందని అన్నారు వాహనాలు నడిపేటప్పుడు అతివేగంగా వెళ్లకుండా నెమ్మదిగా వాహనాలు నడుపుకుంటూ తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు ప్రతి వాహనాదారుడు కి తప్పనిసరిగా ఇన్సూరెన్స్, లైసెన్సు, తోపాటు వాహనాలకు సంబంధించిన ఇతర రికార్డులు ఉండాలని వివరించారు రోడ్డు ప్రమాదాలు నివారించే విధంగా వాహనాలు నడిపి తమ కుటుంబాలలో వెలుగు నింపాలని తెలియజేశారు. అతివేగంతో వాహనాలను నడిపితే జరగరాని రోడ్డు ప్రమాదం జరిగితే ఆ కుటుంబం అంతా చీకటి జీవితంగా నెలకొంటుందని చెప్పారు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు ముఖ్యంగా మైనర్ బాలలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయక తప్పదని అన్నారు ప్రతి ద్విచక్ర వాహనాదారుడు హెల్మెట్ ధరించి తమ ప్రాణాలు కాపాడుకునే విధంగా వాహనాలు నడపాలని వాహనాదారులకు తెలియజేశారు సరైన రికార్డులు లేని వాహనాలను గుర్తించి చలానా విధించారు గ్రామీణ ప్రాంతాలలో ప్రశాంతమైన వాతావరణం లో ప్రజలు ఉండాలని చెప్పారు చిన్న చిన్న విషయాలకు తగాదాలు ఘర్షణ వాతావరణం నెలకొంటే పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కఠినమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు ఏవైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకొని వస్తే ఆ సమస్యల్ని సమ రహస్యంగా పరిష్కరించే విధంగా పోలీస్ శాఖ ప్రజలకు సేవలు అందించడం జరుగుతుందని ఆత్మకూరు ఎస్సై డి. వెంకటనారాయణ రెడ్డి తెలిపారు వీరి వెంట కానిస్టేబుల్ శ్యామ్, స్పెషల్ పార్టీ కానిస్టేబుళ్లు వాహనదారులు తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నల్లకాలువ గ్రామంలో గో టు విలేజ్

- చదివే మాదిగ జాతి అభివృద్ధికి ఆయుధం
- ఎస్సీ వర్గీకరణ ఫలాల కోసం ఉన్నత చదువులు చదవాలి
- మాదిగ జాతిలో చదువుకున్న యువతి యువకులు ఉద్యోగాలు సాధించాలి

ఆత్మకూరు జూన్ 6 వార్త సాక్ష్యం




శనివారం మండల పరిధిలోని నల్లకాలువ గ్రామంలో గోటు విలేజ్ కార్యక్రమం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు వనమాల పుల్లయ్య మాదిగ, ఆత్మకూరు టౌన్ అధ్యక్షులు నాని మాదిగ ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మదనపల్లి బుజ్జి మాదిగ, జిల్లా నాయకులు కాటేపోగు నాగన్న మాదిగ, శ్రీశైలం నియోజకవర్గం నాయకులు భాష పోగుల చిన్న వెంకటరమణ మాదిగ, రామారావు మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు 40 రోజుల గోటు విలేజ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు నంద్యాల జిల్లా ఇన్చార్జి డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ, జాతీయ ఎంఎస్పి నాయకులు చిలక రాబిన్సన్ మాదిగ, ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు భాష పోగుల దుర్గయ్య సలహాలు పాటిస్తూ కార్యక్రమం గో టు విలేజ్ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. జులై 7వ తేదీన 32వ. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఏబిసిడి వర్గీకరణ మందకృష్ణ మాదిగ సుదీర్ఘ పోరాట ఫలితం అని అన్నారు. వర్గీకరణ ఫలాలు అనుభవించాలంటే మాదిగ బిడ్డలంతా ఉన్నతమైన చదువులు చదవాలని సూచించారు. ఉద్యోగాలు సాధించాలని కష్టపడి చదవాలని చదివే మన ఆస్తి అని పేర్కొన్నారు. బడి మానేసిన పిల్లలంతా బడిలో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గ్రామ నాయకులు యువత విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు విజయవంతగా పూర్తి చేయాలి

-అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలి

జూన్ 6 వార్త సాక్ష్యం:



ప్రజాపాలన -- ప్రగతిపాలన కార్యక్రమంలో భాగంగా జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలో నిర్వహించిన గ్రామ సభ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ పాల్గొన్నారు. ప్రజల సమస్యలు, అభివృద్ధి అవసరాలు, సంక్షేమ పథకాల అమలుపై ప్రజల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు.సమావేశంలో జగిత్యాల డిఎస్పీ పురుషోత్తం రెడ్డి, జగిత్యాల రూరల్ తహసీల్దార్, ఎంపిడివో, సర్పంచ్ తో కలిసి పాల్గొన్న అదనపు కలెక్టర్, ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు సమర్థవంతంగా అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. గ్రామ పరిధిలోని మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు తదితర అంశాలపై ప్రజలతో చర్చించి, అందిన వినతులు మరియు ఫిర్యాదులను సంబంధిత శాఖల ద్వారా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతో స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కరించడమే గ్రామ సభల ముఖ్య ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధి కారులు, గ్రామ ప్రజలు మరియు తది తరులు పాల్గొన్నారు.

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ ధరలు తగ్గించాలి

- ఈ నెల 9న రాస్తారోకోను జయప్రదం చేయండి :సిపిఎం, సిపిఐ

ఆత్మకూరు జూన్ 6 వార్త సాక్ష్యం




కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ ధరలను తగ్గించాలని కోరుతూ ఈనెల 9వ తేదీన ఆత్మకూరు పట్టణంలోని బస్టాండ్ దగ్గర జరుగు రాస్తారోకోలో ప్రజల అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి. యేసు రత్నం, సిపిఐ తాలూకా కార్యదర్శి ప్రతాప్, సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్,మండల కార్యదర్శి పి సుధాకర్ ఏఐటీయు సీ కార్యదర్శి దాదా పీర్లు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని డాక్టర్ ఏ.ధనుంజయ మీటింగ్ హాల్ నందు సిపిఎం సిపిఐ పార్టీల ఉమ్మడి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ ధరలను 15 రోజుల వ్యవధిలోనే నాలుగుసార్లు పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి ఎనిమిది రూపాయలు ప్రజలపై మోయలేని భారంవేసింది అన్నారు. గతంలో విదేశాలలో క్రూడ్ ఆయిల్ ఒక బ్యారల్ ధర 65 డాలర్లు ఉన్నప్పుడు తక్కువ ధరకు పెట్రోల్ డీజిల్ అమ్మాలి కానీలీటరు పెట్రోల్, డీజిల్ ధరలను 110 రూపాయలు అధిక ధరకు అమ్మారు ఒక లీటరుపై 55 రూపాయలు అదనంగా వసూలు చేసి లక్షల కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని కొల్లగొట్టారు అది చాలదు అన్నట్లుగా ప్రస్తుతం క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగాయి అనే పేరుతో లీటర్ పైన 8 రూపాయలు పెంచి పేద మధ్యతరగతి ప్రజలపై మోయలేని భారాలు వేయడం చాలా దుర్మార్గం అన్నారు. గతంలో పెట్రోల్ ధరలు తగ్గినప్పుడు పెట్రోల్ ధరలు ఎందుకు తగ్గించలేదు ప్రస్తుతం పెట్రోలు ధరలు పెరిగాయని ఎక్కువ రేట్లకి అమ్మడం ఎంతవరకు సమంజసం అని అన్నారు ప్రజలు నరేంద్ర మోడీ చేసే మోసాన్ని గమనిస్తున్నారు రాబోయే రోజుల్లో నరేంద్ర మోడీకి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కులం మతం వంటి వాటిని అడ్డం పెట్టుకొని మత రాజకీయాలు చేస్తూ తన యొక్క దుర్మార్గాన్ని కప్పిపుచ్చుకుంటూ మనుగడ సాగించాలని చూస్తున్నారు ఇది ఎంతకాలము కొనసాగదని తొందరలోనే పతనం తప్పదని అన్నారు రాష్ట్రం లోని చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం కేంద్రంలోని నరేంద్ర మోడీ పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ ధరలు విపరీతంగా పెంచి ప్రజలపై భారాలు వేస్తుంటే వాటి గురించి చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ ఇద్దరూ ఒక్క మాటంటే ఒక మాట మాట్లాడడం లేదంటే వీరికి ప్రజల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నదో అర్థమవుతున్నది మహానాడు మీటింగు మహా సంబరంగా చేసుకున్నా మని ప్రజలకు సంక్షేపతకాలు అమలు చేస్తూసు పరిపాలన అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటు న్నారు కానీ మహానాడు మీటింగ్లో ప్రజల యొక్క స్థితిగతుల గురించి గానీ ప్రజల ఆర్థిక అంశాల గురించి గానీ ప్రజలపై కేంద్రం వేసిన భారాల గురించి గానీ ఒక్క మాటంటే ఒక్క మాట కూడా ప్రజల గురించి మహానాడులో మాట్లాడకపోవడం చాలా అన్యాయం అన్నారు . ప్రజల పైన కేంద్ర ప్రభుత్వం వేసిన ధారాలపైన చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ ఎందుకు నోరు మెదపడం లేదు నోరు ఏమైనాపడిపోయిందా?అన్ని విషయాలలో ప్రజలను రెచ్చగొట్టడంలో సనాతన ధర్మ గురించి బోధించే విషయంలో చాలా చురుకుగా ఉండే వీళ్లు మరి ప్రజల కష్టాల గురించి ఎందుకు మాట్లాడలేక పోతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా వెంటనే స్పందించి ప్రజల పైన వేసిన భారాలను తగ్గించి పెంచిన పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ ధరలు తగ్గించే దానికోసం వెంటనేచర్యలు చేపట్టాలని ఈనెల 9వ తేదీ ఆత్మకూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ముందర జరుగు రాస్తారోకోలో పట్టణ ప్రజలు, మేధావులు, లౌకికవాదులు, అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు . ఈ సమావేశంలో సిపిఎం పార్టీ నాయకులు మహబూబ్ బాషా,చందా వారి వెంకటేశ్వర్లు , డి రామ్ నాయక్,ఏ సురేంద్ర,వీరన్న,గణపతి, తదితరులు పాల్గొన్నారు.

# బాలబాలికల సంరక్షణ మనందరి సమిష్టి బాధ్యత

-మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

-మహిళల,బాలిక భద్రతే మా బాధ్యత సీపీ గౌష్ ఆలం,






జూన్ 6 వార్త సాక్ష్యం:

బాలబాలికలబ సంరక్షణ మనందరి సమిష్టి బాధ్యత కావాలని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం మానకొండూర్ మండల కేంద్రంలోని కేఎస్ కన్వెన్షన్ లో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో బాల పంచాయతీపై నిర్వహించిన అవగాహన సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం హ్యాండ్ బుక్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ, వారి భద్రత,సమగ్ర అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. పిల్లలపై జరుగుతున్న వివిధ రకాల దౌర్జన్యాలు, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, ఆన్‌లైన్ వేధింపులు వంటి సమస్యలను అరికట్టేందుకు ప్రభుత్వం, పోలీసు శాఖ, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లల హక్కులపై అవగాహన పెంపొందించడం ద్వారా వారి భవిష్యత్తును మరింత సురక్షితంగా తీర్చిదిద్దవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో, ప్రతి పాఠశాలలో బాలల సమస్యలను గుర్తించి, వెంటనే పరిష్కరించే వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. బాలల అభిప్రాయాలకు విలువనిస్తూ, వారి ఆలోచనలకు వేదిక కల్పించేందుకు బాల పంచాయతీలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. “బాలల హక్కుల పరిరక్షణకు, వారిలో నాయకత్వ వికాసానికి ‘ఇదొక అద్భుతమైన వేదిక అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లలు తమ గ్రామం, పాఠశాల, కుటుంబం, సమాజ పరమైన సమస్యలను స్వయంగా గుర్తించడమే కాకుండా ఆయా సమస్యలపై చర్చించి పరిష్కారాలను వెతకడం అద్భుతమని ఆయన పేర్కొన్నారు. ఆలోచనా శక్తిని, దృక్పథాన్ని విస్తృతపర్చుకోవడం వారిలో ఆత్మవిశ్వాసం మెండుగా పెరుగుతుందన్నారు. ఆరోగ్యం, విద్య, బాలల రక్షణ వంటి కీలక అంశాలపై పిల్లలు తమ అభిప్రాయాలను ధైర్యంగా వ్యక్తం చేస్తూ గ్రామాభివృద్ధిలో చురుకుగా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి కోరారు. విద్యతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యతలపై కూడా పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడుపుతూ వారి సమస్యలను తెలుసుకోవాలని, సాంకేతికత వినియోగంలో జాగ్రత్తలు పాటించేలా మార్గనిర్దేశం చేయాలని సూచించారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో బాలల హక్కులు, రక్షణ అంశాలపై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు అభినందనీయ మని ఎమ్మెల్యే కొనియాడారు. “మహిళల,బాలిక భద్రతే మా బాధ్యత : సీపీ గౌష్ ఆలం” కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ మహిళలు, బాలల భద్రత కల్పించడమే తమ బాధ్యత అని, అందుకే జిల్లా పోలీసు శాఖ మహిళలు, బాలికల రక్షణ, భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జిల్లాలో బాలికలను రక్షించేందుకు వినూత్న కార్యక్రమాలు ఇప్పటికే చపట్టామని, అందులో భాగంగానే ‘స్నేహిత’ అనే కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని ఆయన చెప్పారు. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేకంగా ‘సీక్రెట్ బాక్స్’ లను ఏర్పాటు చేయాలని విద్యాసంస్థల యాజమాన్యాలను ఆదేశించామని సీపీ తెలిపారు. విద్యార్థినులు తమకు ఎదురయ్యే ఎలాంటి సమస్యలనైనా, వేధింపులనైనా ఈ సీక్రెట్ బాక్సుల ద్వారా రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని, ఈ బాక్సులకు తాళాలు వేసి ఉంచుతామని, వాటి తాళం చెవులు మహిళా కానిస్టేబుళ్ల ఆధీనంలోనే ఉంటాయని,ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. మహిళలు, విద్యార్థినులు ఎలాంటి వేధింపులు ఎదురైనా అధైర్యపడకుండా తక్షణమే షీ టీమ్స్ సేవలను వినియోగించుకోవాలని సీపీ సూచించారు. బాధితులు నేరుగా కాకుండా మొబైల్ నంబర్ 8712670759 ద్వారా వాట్సాప్ లేదా కాల్ చేసి ఫిర్యాదు చేస్తే సత్వర చర్యలు తీసుకుంటామని, ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, అందు వల్ల నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చని సీపీ పేర్కొన్నారు. ఈ అవగాహన సదస్సులో జిల్లా అదనపు కలెక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ ధనలక్ష్మి, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి పర్వీన్, ఏసీపీ విజయకుమార్, ఇన్స్పెక్టర్లు శ్రీలత, పుల్లయ్య, రమేష్‌లతో పాటు షీ టీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగానికి చెందిన సభ్యులు, మహిళలు, బాలలు తదితరులు పాల్గొన్నారు.

# దేవుడు మొక్కలో విషాదం

-మంజీర లో మునిగి ముగ్గురి మృతి..మరొక్కరి పరిస్థితి విషమం



జూన్ 6 వార్త సాక్ష్యం

బాన్సువాడ మండలం మంజీర నదిలో నలుగురు గల్లంతు అయ్యారుగల్లంతు అయిన వారిలో అనిత (40),పావని (15),శివాని (13 )ముగ్గురు మృతి చెందగ భాను ప్రసాద్ (12) అనే బాలుడు పరిస్తితి విషమంగ ఉంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.మృతుల్లో అనిత శివాని తల్లి కూతుర్లు ఉన్నారు.పిట్లం మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన పండరి తమ మొక్కను తీర్చుకునేందుకు బాన్సువాడ మంజీర నది ఎల్లమ్మ గుడి వద్ద చేరుకున్నారు.ఈ కార్యక్రమానికి బంధువులు వచ్చారు.మృతులు స్నానకి వెళ్ళారు ఒకరు లోపల జారి పోవడంతో ఒకరినొకరు బతికించే క్రమంలో గల్లంతయ్యారు.మృతులు తల్లి అనిత కూతురు శివాని లింగంపేట్ మండలం పరిమల గ్రామం నుండి వచ్చారు.పిట్లం మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన బాలిక పావని (15) వచ్చింది.పిట్లం మండలం గోద్మేగావు కు చెందిన భాను ప్రసాద్ (13) ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాలుడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.బాలుడు భాను ప్రసాద్ ను వారి కుటుంబీకులు స్థానిక సెవెన్ హిల్స్ దవాఖానకు తరలించారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఈ ఘటనతో మృతుల గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## భద్రాచలం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అయ్యప్ప కాలనీ

-రెవిన్యూ కాలనీల్లో
-భద్రాచలం పోలీసుల ఆధ్వర్యంలో కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్..

జూన్ 6 వార్త సాక్ష్యం





జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు భద్రాచలం డిఎస్పి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం తెల్లవారు జామున భద్రాచలం పోలీస్ స్టేషన్ పరిధిలోని అయ్యప్ప కాలనీ, రెవెన్యూ కాలనీల్లో కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరియైన పత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని 37 ద్విచక్ర వాహనాలను, 02 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కాలనీవాసులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి డిఎస్పి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని, గంజాయి,మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే నష్టాల గురించి తెలియజేశారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. నేరాల నియంత్రణ కొరకు తమ నివాస ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించ వలసిందిగా కోరారు. మహిళలు & పిల్లల భద్రత గురించి పలు సూచనలు చేశారు.తమ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని సంబంధిత అధికారులతో మాట్లాడి వారి పరిష్కారాన్ని కృషి చేస్తానని, విపత్కర సమయాలలో ఆపదలో ఉన్నప్పుడు డేల్ 100నకు ఫోన్ చేసి పోలీసువారి సేవలు పొందాలని సూచనలు చేశారు. సుమారు 90 మందికి పైగా పోలీసు అధికారులు మరియు సిబ్బంది కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ లో పాల్గొన్నారు.ఈ ఆపరేషన్ లో భద్రాచలం డిఎస్పి అరుణ్ కుమార్, ఇన్స్పెక్టర్ నాగరాజు, సబ్ ఇన్స్పెక్టర్లు, సిఆర్పిఎఫ్ సిబ్బంది, ట్రాఫిక్ మరియు స్టేషన్ల సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది, నార్కోటిక్స్ స్నిఫర్ డాగ్ పాల్గొన్నారు.

# భైంసా అభివృద్ధికి సమష్టి కృషి అవసరం





-ప్రజాప్రతినిధులు,అధికారులు సమన్వయంతో పనిచేయాలి
-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

జూన్ 6 వార్త సాక్ష్యం

భైంసా మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం భైంసా మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మున్సిపాలిటీ అభివృద్ధి సమీక్ష సమావేశంలో ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్,జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని వెంటనే పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని సూచించారు.అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.ప్రజా అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించి పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.వర్షాకాలం నేపథ్యంలో వరదల నివారణ చర్యలు,ఘన వ్యర్థాల నిర్వహణ, పట్టణ పరిశుభ్రత, మొక్కల నాటకం, ఎస్ఐఆర్ ప్రక్రియ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఈ అంశాలపై సమగ్ర కార్యాచరణ రూపొందించేందుకు త్వరలోనే మరో సమావేశం నిర్వహిస్తామని కలెక్టర్ వెల్లడించారు.

**అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలి**
**ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్**

మున్సిపాలిటీ అభివృద్ధికి అధికారులు,ప్రజాప్రతి నిధులు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు.ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటువంటి విభేదాలకు తావు లేకుండా అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. ప్రతి వార్డులో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా కౌన్సిలర్లు చొరవ చూపాలని కోరారు. సమస్యలు ఎదురైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించాలని పేర్కొన్నారు.

**సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలపై కఠిన చర్యలు ఎస్పీ**

ప్రజలంతా సామరస్య వాతావరణంలో కలిసి మెలిసి జీవించాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల పిలుపునిచ్చారు. సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు.వ్యక్తిగత దూషణలు, విద్వేషపూరిత వ్యాఖ్యలు లేదా కల్లోలాలు సృష్టించే విధంగా వ్యవహరించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.వెంకటేశ్వర్లు,సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్,ఏఎస్పీ సాయి కిరణ్,మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి,మున్సిపల్ కమిషనర్ యాదయ్య, కౌన్సిలర్లు,కో-ఆప్షన్ సభ్యులు,వివిధ శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ జిల్లాలోనే పల్లి (బి) ఆదర్శ గ్రామంగా నిలవాలి





-జిల్లా కలెక్టర్ రాజర్షిషా

జూన్ 6 వార్త సాక్ష్యం

ఆదిలాబాద్ జిల్లాలోనే పల్లి(బి) గ్రామం ఆదర్శ గ్రామంగా నిలవాలని, జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు.ప్రజాపాలన -ప్రగతిప్రణాళిక లో భాగంగా తలమడుగు మండలం పల్లి(బి) గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ముందుగా వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు వివరాలను గ్రామసభలో వివరించారు.ఈ సందర్భంగా గ్రామస్తుల నుంచి నేరుగా వినతులు స్వీకరించి,ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని,వాటి తక్షణ పరిష్కారానికి క్షేత్రస్థాయిలోనే అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రాబోయే వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో నీటి సంరక్షణ, వ్యవసాయ ప్రణాళికలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు.ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున, రైతులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సాగు దిగుబడి పెంచే ట్రైకోడెర్మా వంటి పద్ధతులు పాటించాలని కోరారు.అలాగే,భూగర్భ జలాల పునరుద్ధరణకు ప్రతి బోర్ వెల్‌తో పాటు ఒక రీఛార్జ్ స్ట్రక్చర్‌ను తప్పనిసరిగా నిర్మించుకోవాలని సూచించారు.పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా తడి, పొడి చెత్త సేకరణను పక్కాగా అమలు చేయాలని, హరితహారంలో భాగంగా ప్రతి ఇంటి పరిధిలోనూ, అటవీ ప్రాంతాలలోనూ పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో మహిళా భద్రత,సురక్షిత ప్రయాణాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఆదర్శవంత మైన గ్రామాలుగా నిలవాలంటే యువత మత్తు పదార్థాలు, గంజాయి,ప్రాణాంతక క్యాన్సర్లకు దారితీసే తంబాకు,జర్దా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని,వాటికయ్యే ఖర్చును పౌష్టికాహారం, ఆరోగ్యం కోసం ఉపయోగించుకోవాలని హితవు పలికారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై బి.ఎల్.ఓలు జూన్ 24 లోగా 100% ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని, జూన్ 25 నుండి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలని ఆదేశించారు. గ్రామ అభివృద్ధి పనులైన మిషన్ భగీరథ పైప్‌లైన్ విస్తరణ,సిసి రోడ్లు, వైకుంఠ ధామాలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి సంబంధించిన అంచనాలను పరిశీలించి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.అలాగే, నవంబర్ చివరి నాటికి 'గ్రామ సంఘం భవనం' నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని,'మన ఊరు-మన బడి' కింద పెండింగ్‌లో ఉన్న నిధులను త్వరలోనే విడుదల చేస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్,గణితం,సైన్స్ సబ్జెక్టులలో నాణ్యమైన విద్యనందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.విద్యుత్ సమస్యల పరిష్కారంలో భాగంగా 'దాజుగా' స్కీమ్ కింద అర్హులైన ప్రతి ఎస్టీ కుటుంబానికి ఉచితంగా కరెంట్ మీటర్లు అందించాలని, గ్రామాల్లో వంగిపోయిన, తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాలను,లూజ్ లైన్లను యుద్ధప్రాతిపదికన సరిచేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో భాగంగా భూగర్భ జలాల పునరుద్ధరణకు ప్రతి బోర్ వెల్‌తో పాటు ఒక రీఛార్జ్ స్ట్రక్చర్‌ను తప్పనిసరిగా నిర్మించుకోవాలని గ్రామసభలో కలెక్టర్ సమక్షంలో తీర్మానం చేశారు.ఈ గ్రామ సభ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్ మోహన్,ఎంపీడీవో శంకర్,సర్పంచ్ కట్కం సంజీవ్,పంచాయతీ కార్యదర్శి బాలాజీ, మండల విద్యా,వైద్య, వ్యవసాయ,విద్యుత్, గృహ నిర్మాణ, పంచాయతీ,ఇతర శాఖల అధికారులు, సిబ్బంది,గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ ఐటీ కారిడార్ పరిధిగండిపేటభూకుంభ కోణంకేసులో భారీమలుపు

-వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లాబ్రహ్మానాయుడు తమిళనాడులో అరెస్ట్!
-గండిపేట వేదికగా వెలుగు చూసినవేలకోట్ల రూపాయల భారీ భూకుంభకోణం
-నకిలీ ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా కుంభకోణం విలువ రూ.1,500 కోట్లకు పైగా!
-మెగా ల్యాండ్ స్కామ్ లో బ్రహ్మానాయుడు ముగ్గురు కీలక నిందితులు అరెస్ట్

జూన్ 6 వార్త సాక్ష్యం

హైదరాబాద్ గండిపేట వేల కోట్ల భూకుంభకోణం కేసులో భారీమలుపు. పరారీలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడిని హైదరాబాద్ పోలీసులు తమిళనాడులో అరెస్ట్ చేశారు గండిపేటవేదికగా వెలుగు చూసినవేల కోట్లరూపాయల భారీ భూకుంభకోణం హైదరాబాద్ ఐటీ కారిడార్ పరిధిలోని గండిపేట వేదిక గా వెలుగుచూసిన వేల కోట్ల రూపాయల భారీ ప్రభుత్వ భూ కుంభకోణం కేసులో అత్యంత కీలక పరిణామంచోటుచేసుకుంది ఈ నకిలీజీవోల కుంభకోణంలో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్ కు చెందిన వైఎస్ఆర్‌సీపీ వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడిని హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు నమోదైనప్పటి నుంచి పోలీసులకు దొరకకుండా పరారీలో ఉన్న ఆయనను ప్రత్యేక బృందాలు గాలించి చివరకు తమిళనాడులోని చారిత్రకనగరంకాంచీపురం లో అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు అధికారికం గా ప్రకటించారు.



**నకిలీ ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా కుంభకోణం విలువ రూ.1,500 కోట్లకు పైగా!**

హైదరాబాద్ శివారు ప్రాంతాలైన గండిపేట, నార్సింగి పరిధిలో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో ఈ ముఠా ప్రభుత్వ భూములపై కన్నేసింది. గండిపేట, నార్సింగి పరిసరాల్లోని అత్యంత విలువైన ప్రభుత్వ భూములను తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు నిందితులు ఏకంగా నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులను సృష్టించారు. ఈ నకిలీ పత్రాల ద్వారా వందల ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు అక్రమంగా విక్రయించి సొమ్ము చేసుకోవడానికి బొల్లా బ్రహ్మానాయుడితో పాటు మరికొందరు కీలక నేతలు, బ్రోకర్లు భారీ స్కెచ్ వేశారు. ప్రాథమికవిచారణ మరియు రెవెన్యూ అధికారుల అంచనా ప్రకారం ఈ సుమారు భూ కుంభకోణం విలువ ఏకంగా రూ.1,500 కోట్లకు పైగా ఉంటుందని తేలడం తో ఈ కేసు రాష్ట్రవ్యాప్తం గా సంచలనం సృష్టించింది.

**మెగా ల్యాండ్ స్కామ్‌లో బ్రహ్మానాయుడు ముగ్గురు కీలక నిందితులు అరెస్ట్**

ల్యాండ్ స్కామ్‌కు సంబంధించి హైదరాబాద్ పోలీసులు ఇప్పటికే ముగ్గురు కీలక నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారిని విచారించిన క్రమంలోనే ఈ దందా వెనుక అసలు సూత్రధారి వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడేనని నమ్మదగిన ఆధారాలు లభించాయి. పోలీసులు తన కోసం వెతుకుతున్నారని తెలుసుకున్న బ్రహ్మానాయుడు ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి పొరుగు రాష్ట్రాలకు పారిపోయారు. సాంకేతిక ఆధారాల సాయంతో ఆయన కాంచీపురంలో తలదాచుకున్నట్లు గుర్తించిన సైబరాబాద్/ హైదరాబాద్ పోలీసులు అక్కడకు వెళ్లి ఆయన్ను ఆకస్మికంగా చుట్టుముట్టి అరెస్ట్ చేశారు. ప్రస్తుతం బ్రహ్మానాయుడిని ట్రాన్సిట్ వారెంట్‌పై హైదరాబాద్‌కు తరలిస్తున్నారని, ఇక్కడికి తెచ్చిన తర్వాత ఉన్నతాధికారులు ఆయనను మరింత లోతుగా విచారించి ఈ స్కామ్‌లో ఇంకా ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయనే విషయాలను బయటకు తీయనున్నారని సమాచారం.

# ప్రజలలో అవగాహన పెంపొందించేందుకే గ్రామ, వార్డు సభలు

**తాగునీటి అవసరాల కోసం త్వరలో నిజాంసాగర్ ద్వారా నీటి విడుదల**

జూన్ 6 వార్త సాక్ష్యం

సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు వివిధ అంశాలపై ప్రజలలో అవగాహన పెంపొందించాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామ పంచాయతీలలో గ్రామ సభలను, మున్సిపల్ పట్టణాలలో వార్డు సభలను నిర్వహిస్తోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. వర్ని మండలం హుమ్నాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో శనివారం స్థానిక సర్పంచ్ అప్పిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. జయజయహే తెలంగాణ గీతాలాపనతో సభకు శ్రీకారం చుట్టి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. పంటల మార్పిడి, సరైన మోతాదులో ఎరువుల వినియోగం, రక్షిత మంచినీటి సరఫరా, వర్షపు నీటిని ఓడిసిపట్టడం, భూగర్భ జలాల సంరక్షణ, విరివిగా మొక్కల పెంపకం, పర్యావరణ సమతుల్యాన్ని కాపాడడం, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ, వానాకాలంలో సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో నిజామాబాద్ జిల్లా అరుదైన ఘనతను కలిగి ఉన్నదని గుర్తు చేశారు. పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి విధానాన్ని అవలంభిస్తూ సాగు రంగంలో ప్రత్యేకతను చాటాలని రైతులకు సూచించారు. ఎల్ నినో ప్రభావం వల్ల తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నందున, తక్కువ సాగు నీటి అవసరం కలిగిన పంటలను విత్తుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వం నోటిఫై చేసిన ఆయా పంట రకాలనే సాగు చేయాలని, నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నకిలీ, నాసిరకం విత్తనాలను విక్రయించే డీలర్ల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని, అర్హులైన రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ సబ్సిడీలు, ఇతర ప్రయోజనాలు పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ దోహదపడుతుందని తెలిపారు. కాగా, వర్షాభావ పరిస్థితులు తలెత్తినా కూడా బోధన్, నిజామాబాద్ పట్టణాలు, నిర్దేశిత గ్రామాలకు తాగునీటి ఇబ్బందులు ఏర్పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే రానున్న రెండు రోజులలో నిజాంసాగర్ నీటిని విడుదల చేయించి, బెల్లాల్ చెరువులోకి మళ్లించడం జరుగుతు ఒదన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా ఈగలు, దోమల వ్యాప్తిని నివారించవచ్చని, తద్వారా వ్యాధులు సోకకుండా కాపాడుకోవచ్చని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను గ్రామ పంచాయతీలు తప్పనిసరిగా అమలు చేయాలని అన్నారు. తడి, పొడి, శానిటరీ, ప్రత్యేక వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలన్నారు.




ప్రత్యేక ఓటరు సవరణ(ఎస్.ఐ.ఆర్) కార్యక్రమం గురించి ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో కలెక్టర్ బోర్డుపై ముఖ్యమైన తేదీలు, ఇతర వివరాలు రాస్తూ అవగాహన కల్పించారు. జూన్ 25 నుండి బీ.ఎల్.ఓలు ఇంటింటికి తిరుగుతూ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ నిర్వహిస్తారని, వారికి సహకరించాలని ప్రజలను కోరారు. ప్రతి ఒక్కరు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, మహిళలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకుంటూ ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ హితవు పలికారు. అర్హులైన వారు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ది పొందేలా చొరవ చూపాలన్నారు. గ్రామ సభలో బోధన్ ఆర్డీఓ విజయలక్ష్మి, మండల ప్రత్యేక అధికారి మధుసూదన్, ఏసీపీ శ్రీనివాస్, డీ.ఎల్.పీ.ఓ శ్రీనివాస్, తహసిల్దార్ ప్రశాంత్, స్థానిక అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# చెత్తను నాలుగు రకాలుగా వేరు చేయాలి

**-పారిశుధ్య వాహనాలకు అప్పగించాలి**
**-ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలి**
**-జల వనరులు సంరక్షించాలి**
**-జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్**

జూన్ 6 వార్త సాక్ష్యం

ప్రతి ఇంటిలో చెత్తను నాలుగు రకాలుగా వేరు చేయాలని,పారిశుధ్య వాహనాలకు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ పిలుపు నిచ్చారు.ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం రామన్నపల్లి గ్రామంలోని ప్రగతి ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్షాకాల సన్నద్ధత, పంటల మార్పిడి, వ్యవసాయ,బడి బాట, ఘన వ్యర్థాల నిర్వహణ, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, పారిశుద్ధ్యం, వన మహోత్సవం, జల సంరక్షణ, మహిళల రక్షణ, షి టీమ్, భరోసా కేంద్రం తదితర అంశాలపై గ్రామ ప్రజలతో సుదీర్ఘంగా చర్చించి అవగాహన కల్పించారు.గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి నాలుగు చెత్త బుట్టలు పంపిణీ చేయాలని,బట్ట సంచులు ఇవ్వాలని, గ్రామంలో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేసి స్టీల్ ప్లేట్స్, గ్లాసులు, జగ్గులు ఇవ్వాలని ప్రతి వేడుకలకు ఇవ్వాలని ప్రతిపాదనలు చేశారు.జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కింద 10 థీమ్ లతో 10 శాఖల ఆద్వర్యంలో వివిధ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రభుత్వ పథకాలు,సంక్షేమ అభివృద్ధి పనులు ప్రజల్లోకి తీసుకువెళ్లడం,సంపూర్ణ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. వర్షాకాలానికి ముందే గ్రామాల్లోని డ్రైనేజీలు శుభ్రం చేయించాలని తెలిపారు.డ్రైనేజీల్లో ప్లాస్టిక్,బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయవద్దని కోరారు.ఘన వ్యర్థాల నిర్వహణ – 2026 పై ప్రజలు కచ్చితంగా అవగాహన కలిగి ఉండాలని,చెత్తను నాలుగు రకాలుగా వేరు చేయాలని సూచించారు.తడి,పొడి,సానిటరీ,ప్రత్యేక చెత్త వేరు చేసి గ్రామ పంచాయతీ వాహనానికి అందించాలని సూచించారు.సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్వహణపై అవగాహన పొందాలని,నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ప్రతి గ్రామంలో గ్రామస్థులను సెగ్రిగేషన్ షెడ్లకు తీసుకు వెళ్లాలని సూచించారు.నీటి ట్యాంకులను నెలకు మూడు సార్లు బ్లీచింగ్ తో సిబ్బంది శుభ్రం చేయాలని ఆదేశించారు.ఎల్ నినో ప్రభావం దృష్ట్యా పంటలు సాగు చేసేముందు వ్యవసాయ అధికారులను సంప్రదించి,ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తే ఇబ్బందులు ఉండవని వివరించారు. ఆయిల్ పామ్,సన్న వడ్లు, కూర గాయలు, పప్పు ధాన్యాలు తదితర లాభదాయక పంటలను సాగు చేయడానికి రైతులు ముందుకు రావాలని సూచించారు.ఆయిల్ పామ్ కు సంబంధించి సిద్దిపేట జిల్లా నర్మెట లో పరిశ్రమ ఉందని, పండించిన దిగుబడిని పరిశ్రమకు తీసుకువెళ్ళడానికి దూర భారం కూడా లేదని గుర్తు చేశారు.పంట మార్పిడి చేయకపోతే నేల సారం తగ్గుతుందనే విషయాన్ని రైతులు గమనించాలని పేర్కొన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరించే బీఎల్ఓలకు ప్రజలు సహకరించాలని సూచించారు.కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఈ నెల 25 వ తేదీ నుంచి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.



అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యమన్నారు.గుర్తింపు కార్డులు చూపించి మ్యాపింగ్ ప్రక్రియకు సహకరించాలని కోరారు.బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచాలన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలలు పంపించాలని కోరారు.ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలల్లో ప్రభుత్వం అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జల వనరులు సంరక్షించాలని, ఇంకుడు గుంతలు శుభ్రం చేసి సిద్ధంగా ఉంచాలని, చెరువులు, గ్రామంలోని ఇంకుడు గుంతలు,పామ్ పాండ్ లు సిద్ధంగా ఉంచాలని పిలుపు నిచ్చారు. దీంతో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని తెలిపారు.ఈ నెల 1వ తేదీన జిల్లా వ్యాప్తంగా 2720 ఇందిరమ్మ ఇండ్లకు గృహ ప్రవేశాలు చేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయడంలో రాష్ట్రంలో జిల్లా రెండో స్థానంలో ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ,జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి,జిల్లా పంచాయతీ అధికారి షరీఫ్ఉద్దిన్,జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం,ఉద్యానవన శాఖ అధికారి శరత్,డిప్యూటీ తహసీల్దార్ మురలీకృష్ణ,సర్పంచ్ జ్యోతి,మిషన్ భగీరథ,పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

జూన్ 6 వార్త సాక్ష్యం

మన కాలనీ – మన భద్రత – మన – బాధ్యత అనే అంశం పై నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అవగాహన కల్పించారు.సీసీ కెమెరాల ఏర్పాటు తో నేరాల నియంత్రణ కట్టడి చేయవచ్చన్నారు.సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అందరూ అప్రమత్తంగా ఉండవలన్నారు.ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఆర్మూర్ లో శనివారం నాడు శ్రీ సాయి గార్డన్స్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమానికి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిజామాబాదు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని గుర్తు చేశారు. శాంతియుత వాతావరణం నెలకొని ఉన్న ప్రాంతాలు సత్వర అభివృద్ధి సాధిస్తాయన్నారు. నేరాల నియంత్రణకు ఉపకరిస్తూ , నేరాలు జరిగిన సందర్భాలలో నిందితుల ఆచూకి తెలుసుకునేందుకు ఉపకరించే సీ.సీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని , సైబర్ నేరగాళ్ల నుండి ఎలాంటి ఫోన్ కాల్స్ వచ్చిన వారికి సంబంధించిన సమాచారం ఇవ్వకుండా సంబంధిత విలేజ్ పోలీస్ ఆఫీసర్





సంబంధించిన అధికారికి సంప్రదించగలరన్నారు. మత్తు పదార్థాలు , దురలవాట్ల కు యువత దూరంగా ఉండాలని హితవు పలికారు. రోడ్ సేఫ్టీ కమిటీని ఏర్పాటు చేసుకుని రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం కృషి చేయాలన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలని , ప్రజలకు భద్రతా కల్పించడానికి పోలీసు శాఖ ఎల్లవేళలా సమాయత్తంగా ఉంటుందని తెలిపారు.

# నీట్-2026 పరీక్ష ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలి

**-రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు**





జూన్ 6 వార్త సాక్ష్యం

రాష్ట్రంలో నీట్-2026 పరీక్ష ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు.శనివారం హైదరాబాద్ నుండి అదనపు డి జి పి మహేష్ భగవత్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సి.పి.లు, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నీట్-2026 పరీక్ష నిర్వహణ ఏర్పాట్లు, వరి ధాన్యం కొనుగోలు, జూన్ 9న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి సభ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ...రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 21వ తేదీన జరగనున్న నీట్-2026 పరీక్షకు 24 పట్టణాలలో 208 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, 72 వేల 956 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ఇందుకు తగిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయాలని, రాష్ట్ర, జిల్లా సమన్వయ కమిటీలు అందుకు అనుగుణంగా పని చేయాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులపై తక్షణమే స్పందించాలని, వదంతులు వ్యాప్తి కాకుండా చూడాలని తెలిపారు.ప్రభుత్వ సంస్థలలో మాత్రమే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాలలో సి సి కెమెరాలు ఏర్పాటు చేయాలని,అంతర్జాతీయ యోగా దినోత్సవం దృష్ట్యా పరీక్ష నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. పరీక్ష రోజున ప్రశ్న పత్రాల తరలింపు, అభ్యర్థుల రిజిస్ట్రేషన్, బయోమెట్రిక్ వెరిఫికేషన్, అభ్యర్థుల తనిఖీ, బందోబస్తు తదితర ఏర్పాట్లను ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టాలని తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 71 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి 4 వేల 488 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు 10 లక్షల 58 వేల మంది రైతుల ఖాతాలలో 13 వేల 577 కోట్ల రూపాయల కనీస మద్దతు ధర జమ చేయడం జరిగిందని, మిగిలిన ధాన్యాన్ని కూడా త్వరితగతిన కొనుగోలు చేసి కొనుగోలు ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి మండల మహిళా సమాఖ్యకు 1 చొప్పున 553 బస్సులను మంజూరు చేయడం జరిగిందని, ఈ బస్సులను జూన్ 9వ తేదీన సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్స్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా మహిళా సమాఖ్య సభ్యులకు లాంఛనంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు.ఈ సభకు సంబంధించిన ఏర్పాట్లు, సభకు మహిళా సమాఖ్య సభ్యుల తరలింపుపై ఆయా జిల్లాల గ్రామీణ అభివృద్ధి అధికారులు, ఆర్ టిసి రీజినల్ మేనేజర్లు సమన్వయంతో పని చేసి సభను విజయవంతం చేయాలని తెలిపారు. జూన్ 12న రాష్ట్రంలోని పాఠశాలల పునఃప్రారంభానికి విద్యార్థులకు అందజేయవలసిన యూనిఫామ్ లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. అదనపు డిజిపి మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలలో సి సి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని,సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలకు ఎప్పటికప్పుడు స్పందించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.మహిళా అభ్యర్థుల తనిఖీలో మహిళ కానిస్టేబుల్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ... జిల్లాలో 1 వేయి 204 మంది అభ్యర్థులు నీట్-2026 పరీక్షకు హాజరు కానున్నారని, పరీక్ష నిర్వహణ కొరకు జిల్లాలో 5 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసుకొని విజయవంతంగా నిర్వహించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వర్షాల దృష్ట్యా కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్లు అందుబాటులో ఉంచడం జరిగిందని, రవాణా సంబంధిత ఏర్పాట్లు చేయడం జరిగిందని, తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిసిపి భాస్కర్,జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) వి.రాములు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా విద్యాశాఖాధి కారి లలిత, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## ఆకర్ష.. ఆకర్ష! విదేశీ పెట్టుబడులకు గాలం




ప్రస్తుత భారత ఆర్థిక వ్యవస్థ పలు సవాళ్లను ఎదుర్కొం టోంది. పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యం లో ఇంధనం, ఎరువులు, ఇతర కమోడిటీ ధరలు భారీగా పెరిగాయి. దాంతో దిగుమతుల వ్యయం తడిసి మోపెడవుతోంది. ఈ సంక్షోభం దీర్ఘకాలం కొనసాగితే దిగుమతుల కోసం చెల్లింపుల కారణంగా మన విదేశీ మారక నిల్వలు వేగంగా కరిగిపోయే ప్రమాదం ఉంది. మరోవైపు మన ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు (ఎఫ్‌పీఐ) పెద్దఎత్తున తరలిపోతున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటికే రూ.2.25 లక్షల కోట్లకు పైగా తరలించేశారు. ఈ రెండు పరిణామాలు మన రూపాయి భారీ పతనానికి, విదేశీ మారక (ఫారెక్స్) నిల్వల తరుగుదలకు కారణమవుత న్నాయి. ఈ నేపథ్యంలో రూపాయి క్షీణతకు అడ్డుకట్ట వేయడంతో పాటు ఫారెక్స్ నిల్వలను పెంచుకునేందుకు అవసరమైన విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వం ఒకే రోజు కీలక చర్యలను ప్రకటించాయి.

**ఆర్‌బీఐ, ప్రభుత్వం చేపట్టిన చర్యలు..**

విదేశీ ఇన్వెస్టర్లకు మన ప్రభుత్వ సెక్యూరిటీల్లో (జీ-సెక్) పెట్టుబడుల పరిధిని విస్తృతం చేసింది. ఫుల్లీ యాక్సెసబుల్ రూట్ (ఎఫఏఆర్)లో భాగంగా కొత్తగా జారీ చేసే 15 ఏళ్లు, 30 ఏళ్లు, 40 ఏళ్ల కాలపరిమితితో కూడిన జీ-సెక్‌లలోనూ విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టేందుకు అనుమతి. స్వల్పకాలిక పెట్టుబడులపై పరిమితి, కాన్సంట్రేషన్ లిమిట్స్‌తో పాటు జనరల్ రూట్‌లో భాగంగా విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లకు (ఎఫపీఐ) వ్యక్తిగతంగా కలిగి ఉండగలిగే సెక్యూరిటీలపైనా పరిమితి ఎత్తివేత. లిస్టెడ్ ఈక్విటీ సాధనాల్లో ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐ), ఓవర్సీస్ సిటిజన్స్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) పరిధిలోకి వచ్చేవారు నియంత్రణ మండలి రిజిస్ట్రేషన్ అవసరం లేకుండా పెట్టగలిగే పెట్టుబడుల పరిమితి పెంపు. అంతేకాదు, పెట్టుబడుల పరిధి.. ఇండివిడ్యువల్ పర్సన్స్ రెసిడెంట్ అవుట్‌సైడ్ ఇండియా (పీఆర్ఓఐ)కూ విస్తరింపు. ప్రభుత్వ సంస్థల విదేశ రుణాల సమీకరణలో ఈ సెప్టెంబరు 30 వరకు విదేశీ మారకం మార్పిడిపై రాయితీ. మూడు నుంచి ఐదేళ్ల కాలపరిమితితో కూడిన ఫారిన్ కరెన్సీ నాన్ రెసిడెన్సీ బ్యాంక్ (ఎఫ్‌సీఎన్ఆర్‌బీ) డిపాజిట్ల సమీకరించడంలో డీలర్ బ్యాంకుల పూర్తి హెడ్జింగ్ ఖర్చులను భరించనున్న ఆర్‌బీఐ. ఈ సదుపాయం 2026 సెప్టెంబరు 30 వరకు అందుబాటులో ఉంటుంది.

## అమెరికా మార్కెట్లను ముంచేసిన 'జాబ్స్ రిపోర్ట్'..

# కుప్పకూలిన ఇండెక్స్‌లు




అమెరికా స్టాక్ మార్కెట్లలో వారాంతాన తీవ్రమైన ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సాంకేతిక రంగానికి చెందిన షేర్లు భారీగా అమ్ముడుపోవడంతో మార్కెట్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. ముఖ్యంగా నాస్‌డాక్ సూచీ గడిచిన ఏడాది కాలంలోనే అత్యంత దారుణమైన పతనాన్ని నమోదు చేసింది. అంచనాలను మించిన 'మే నెల జాబ్స్ రిపోర్ట్' మార్కెట్లలో వడ్డీ రేట్లు మరింత పెరుగుతాయనే భయాలను రేకెత్తించడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈ క్రమంలో నాస్‌డాక్ సూచీ ఏకంగా 4.2 శాతం పడిపోయింది. ఎస్అండ్‌పీ 500 2.6% నష్టపోయింది. ఫలితంగా గత 9 వారాలుగా వరుసగా సాగుతున్న లాభాల పరంపరకు బ్రేక్ పడినట్లైంది. కొంత నిలకడగా ఉన్నప్పటికీ, శుక్రవారం 1.3% నష్టంతో ముగిసింది.

**ఐటీ, ఏఐ డిమాండ్‌పై అనుమానాలు.. టెక్ షేర్ల పతనం!**

బుధవారం సెమీకండక్టర్ దిగ్గజం 'బ్రాడ్‌కామ్' ప్రకటించిన బలహీనమైన ఫ్యూచర్ గైడెన్స్ మార్కెట్‌ను కలవరపెట్టింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో డిమాండ్ అంత వేగంగా పెరగకపోవచ్చనే భయాలు ఇన్వెస్టర్లలో మొదలయ్యాయి. దీని ప్రభావంతో ఎన్వీడియా షేరు 6.2% పడిపోగా, బ్రాడ్‌కామ్ షేరు 7.9% నష్టపోయింది. ఏఐ, చిప్స్ రంగానికి చెందిన ఇతర దిగ్గజ కంపెనీలైన మైక్రాన్ , మార్వెల్ , ఇంటెల, ఎఎమ్‌డి , క్వాల్‌కామ్ (, ఆర్మ్ హోల్డింగ్స్ షేర్లు ఏకంగా 10 శాతం లేదా అంతకంటే ఎక్కువ పతనమై ఊచకోతకు గురయ్యాయి.

**మార్కెట్‌ను ముంచేసిన 'హాట్ జాబ్స్ రిపోర్ట్'**

అమెరికా లేబర్ డిపార్ట్‌మెంట్ నివేదిక ప్రకారం.. మే నెలలో ఆర్థికవేత్తలు 80,000 ఉద్యోగాలు వస్తాయని అంచనా వేయగా, దానికి రెట్టింపు కంటే ఎక్కువగా 1,72,000 కొత్త ఉద్యోగాలు వచ్చాయి. జాబ్ మార్కెట్ బలంగా ఉండటంతో ద్రవ్యోల్బణం మళ్లీ పెరుగుతుందనే భయం ఇన్వెస్టర్లలో వ్యక్తమైంది. మరోవైపు, ఈ ఏడాది చివర్లో అమెరికా సెంట్రల్ బ్యాంక్ వడ్డీ రేట్లను పెంచే అవకాశం 50% లోపు మాత్రమే ఉందని ట్రేడర్లు భావించారు. కానీ ఇప్పుడు సీఎమ్ఈ డేటా ప్రకారం, ఫెడ్ వడ్డీ రేట్లను పెంచే అవకాశం ఏకంగా 70%కి పెరిగింది. 2026 అంతటా వడ్డీ రేట్లు అత్యధిక స్థాయిలోనే కొనసాగుతాయని ఇన్వెస్టర్లు అంచనాకి రావడం కూడా దీనికి కారణంగా చెబుతున్నారు. భవిష్యత్తులో భారీ లాభాలను అంచనా వేసే టెక్నాలజీ కంపెనీలపై వడ్డీ రేట్ల పెరుగుదల ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుందని భావించి కూడా టెక్ షేర్లలో భారీగా అమ్మకాలు జరిగాయంటున్నారు. అమెరికా మార్కెట్ల ప్రభావం సోమవారం భారత స్టాక్ మార్కెట్ల మీద ఎలాంటి ప్రభావం చూపిస్తాయో చూడాలి.

## జీడీపీ వృద్ధి రేటు అదుర్స్




కష్ట కాలంలోనూ భారత ఆర్థిక వ్యవస్థ తన సత్తా చాటింది. 2025-26 ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4) లో 7.8 శాతం వృద్ధి రేటు నమోదు చేసినట్టు ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంతో పోలిస్తే ఇది 0.2 శాతం తక్కువ. గత ఆర్థిక సంవత్సరం (2025-26) మొత్తానికి చూసినా భారత జీడీపీ 7.7 శాతం వృద్ధి రేటు నమోదు చేసింది. అంతకు ముందు సంవత్సరం (2024-25)తో పోలిస్తే ఇది 0.7 శాతం ఎక్కువ. ఈ ఏడాది ఫిబ్రవరి 28 నుంచి ప్రారంభమైన పశ్చిమాసియా యుద్ధంతో చమురు, ఎల్‌పీజీతో పాటు ప్రధాన కమోడిటీల ధరలు చుక్కలంటిన తరుణంలోనూ భారత జీడీపీ క్యూ4లో 7.8 శాతం వృద్ధి రేటు నమోదు చేయడం విశేషమని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ చెప్పారు.ప్రస్తుత ధరల ప్రకారం రూ.346.36 లక్షల కోట్లు: ప్రస్తుత ధరల ప్రకారం చూస్తే 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీ విలువ రూ.346.36 లక్షల కోట్లకు చేరింది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 8.9 శాతం (రూ.28.29 లక్షల కోట్లు) ఎక్కువ. జీడీపీ విలువ లెక్కింపునకు ప్రామాణికంగా తీసుకున్న 2022-23 ఆర్థిక సంవత్సరం నాటి ధరల ప్రకారం చూస్తే 2026 మార్చి నాటికి భారత జీడీపీ రూ.323.12 లక్షల కోట్లకు చేరింది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది రూ.23.23 లక్షల కోట్లు ఎక్కువ. మార్చి త్రైమాసికంలో జీడీపీ విలువ రూ.87.77 లక్షల కోట్లుగా ఉంది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఇది రూ.81.40 లక్షల కోట్లుగా ఉంది.

# అఫ్గాన్ బౌలర్లపై భారత్ ఆధిపత్యం

# రాహుల్ క్లాస్ సెంచరీ



ముల్లాన్‌పుర్ వేదికగా అఫ్గానిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో ఓపెనర్ కేఎల్ రాహుల్ అద్భుత శతకంతో జట్టుకు బలమైన పునాది వేశాడు. రాహుల్ 165 బంతుల్లో 100 పరుగులు చేసి ఔట్ అయ్యాడు. తన టెస్ట్ కెరీర్‌లో ఇది 12వ శతకం కాగా.. టెస్టుల్లో అతడు శతకం సాధించిన ఆరో ప్రత్యర్థి జట్టు అఫ్గాన్.ఆరంభంలో కొంత నెమ్మదిగా ఆడిన రాహుల్.. క్రమంగా ఇన్నింగ్స్‌ను చక్కదిద్దుతూనే అఫ్గాన్ బౌలర్లపై ఆధిపత్యం చెలాయించాడు. 61వ ఓవర్లో జియావుర్ రెహ్మాన్ బౌలింగ్‌లో 2 పరుగులతో సెంచరీ సాధించాడు. ఆ తర్వాతి బంతికే వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. ఈ క్రమంలో ఓపెనర్‌గా మరో మైలురాయిని అందుకున్నాడు రాహుల్. భారత్ తరఫున టెస్టుల్లో అత్యధిక శతకాలు సాధించిన ఓపెనర్ల జాబితాలో నాలుగో స్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో దిగ్గజ బ్యాటర్ సునీల్ గావస్కర్ 33 శతకాలతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.




## అతడో గేమ్ ఛేంజర్.. వైభవ్ సూర్యవంశీ ఎంపికపై బీసీసీఐ తొలి స్పందనిదే

భారత క్రికెట్‌లో మరో యువ సంచలనం వెలుగులోకి వచ్చింది. పదిహేనేళ్ల వయసులోనే తన అత్యద్భుత బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షించిన వైభవ్ సూర్యవంశీకి భారత సీనియర్ టీ20 జట్టులో చోటుదక్కింది. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలు సహా ఆసియా క్రీడల కోసం ప్రకటించిన భారత జట్లలో అతడికి స్థానం కల్పించింది బీసీసీఐ. దీంతో టీమ్‌ఇండియాకు ఎంపికైన అతి పిన్న వయస్కుడిగా చరిత్ర సృష్టించాడీ బుడ్డోడు. ఇక.. వైభవ్ ఎంపికపై బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ప్రశంసలు కురిపించాడు. ఇంత చిన్న వయసులో వైభవ్ ఆడుతున్న తీరు అసాధారణం. ప్లేఆఫ్ మ్యాచ్‌ల్లోనూ దాదాపు ఒంటిచేత్తో రాజస్థాన్ రాయల్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ సీజన్‌లోనే కాదు.. గత సీజన్ నుంచే అతడు తన ప్రతిభను చాటుకున్నాడు. తీవ్రమైన పోటీ, ఒత్తిడితో కూడిన టీ20 క్రికెట్లో ఎంతద్భుతంగా బ్యాటింగ్ చేయగలడో చూపించాడు. టీ20 క్రికెట్లో అతడిపై చాలా ఆశలున్నాయి. క్షణాల్లో మ్యాచ్ గమనాన్ని మార్చగల సామర్థ్యం అతడి సొంతం(గేమ్ ఛేంజర్). ఆ ప్రతిభతోనే జాతీయ జట్టులో స్థానం సంపాదించుకున్నాడు' అని కొనియాడాడు అగార్కర్.



# స్పోర్ట్స్

## కెప్టెన్సీ కోల్పోయిన సూర్యకుమార్.. ఫస్ట్ రియాక్షన్ ఇదే..




భారత టీ20 జట్టుకు గొప్ప సారథిగా ఎన్నో విజయాలందించిన సూర్యకుమార్ యాదవ్‌కు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలతో పాటు ఆసియా క్రీడల కోసం ప్రకటించిన భారత టీ20 జట్టులో అతడికి మొండిచేయి చూపింది బీసీసీఐ. కెప్టెన్సీ బాధ్యతలను కూడా శ్రేయస్ అయ్యర్‌కు అప్పగిస్తూ సూర్యకుమార్‌కు ఉద్వాసన పలికింది. ఈ నేపథ్యంలో సూర్యకుమార్ తొలిసారిగా స్పందించాడు. జట్టు ఎంపిక అనంతరం తన ఇన్‌స్టా స్టోరీలో టీమ్‌ఇండియా వివరాలను పంచుకున్న స్కై.. 'ఈ ప్రతిభావంతమైన జట్టుకు రాబోయే సవాళ్లలో విజయాలు కలగాలి' అని శుభాకాంక్షలు తెలియజేశాడు. తనకు ఎదురైన నిరాశను పక్కనబెట్టి జట్టుకు మద్దతు తెలపడం అభిమానుల ప్రశంసలం దుకుంటోంది. సూర్యకుమార్ నాయకత్వంలో భారత జట్టు అద్భుత విజయాలు సాధించింది. 2023లో ఆస్ట్రేలియాతో జరిగిన టీ20 సిరీస్‌లో తొలిసారి పగ్గాలు అందుకున్న అతడు.. రోహిత్ శర్మ రిటైర్మెంట్ అనంతరం పూర్తిస్థాయి సారథిగా బాధ్యతలు చేపట్టాడు. అతడి సారథ్యంలో భారత్ 52 మ్యాచ్‌లు ఆడి 42 విజయాలు సాధించింది. 2025 ఆసియా కప్ సహా ఈ ఏడాది స్వదేశంలో జరిగిన టీ20 ప్రపంచకప్‌నూ గెలుచుకుని చరిత్ర సృష్టించింది. అయితే.. కెప్టెన్‌గా విజయవంతమైన సూర్య.. రెండేళ్లుగా బ్యాటింగ్‌లో ఆశించిన స్థాయిలో రాణించకపోతున్నాడు. ఇటీవల ఐపీఎల్‌లోనూ అతడి ప్రదర్శన నిరాశాజనకంగానే సాగింది. ఈ నేపథ్యంలోనే అతడిపై వేటు పడినట్లు తెలుస్తోంది. దీంతో భారత టీ20 జట్టులో సూర్యకుమార్ యాదవ్ ఆధిపత్యానికి తాత్కాలిక విరామం పడినట్లైంది.

# 80 కేజీల డెడ్‌లిఫ్ట్ ఎత్తడంతో గాయమైంది... ఆ సమయంలో మంచానికే పరిమితమయ్యాను: రకుల్ ప్రీత్ సింగ్

-సేఫ్టీ బెల్ట్ లేకపోవడం వల్ల స్లిప్ డిస్క్ సమస్య వచ్చిందని వెల్లడి

-గాయం కారణంగా 40 రోజుల పాటు మంచానికే పరిమితమయ్యానని వివరణ

-డెడ్‌లిఫ్ట్‌ను ఒక ఈగో లిఫ్ట్ అని అభివర్ణించిన నటి

-కష్టకాలంలో భర్త జాకీ భగ్నానీ అండగా నిలిచాడని వ్యాఖ్య

ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్ తాను గతంలో ఎదుర్కొన్న తీవ్రమైన ఆరోగ్య సమస్య గురించి తాజాగా స్పందించారు. జిమ్‌లో శిక్షణ పొందుతున్న సమయంలో 80 కిలోల డెడ్‌లిఫ్ట్‌ను ఎటువంటి సేఫ్టీ బెల్ట్ లేకుండా ప్రయత్నించడం వల్ల స్లిప్ డిస్క్ బారినపడ్డానని, ఆ గాయం కారణంగా సుమారు 40 రోజుల పాటు మంచానికే పరిమితం కావాల్సి వచ్చిందని ఆమె తెలిపారు. నేహా ధూపియా, అంగద్ బేడీలు నిర్వహిస్తున్న 'డబుల్ డేట్' టాక్ షోలో తన భర్త జాకీ భగ్నానీతో కలిసి పాల్గొన్న రకుల్, ఆనాటి చేదు అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. "మీ ట్రైనర్‌లు ఏం చెప్పినా సరే, డెడ్‌లిఫ్ట్ చేయడం అనేది అత్యంత ప్రమాదకరమైన వ్యాయామం. అది కేవలం ఒక ఇగో లిఫ్ట్ మాత్రమే. ఆనాడు నేను చేసిన చిన్న పొరపాటు స్లిప్ డిస్క్‌కు దారితీసింది" అని ఆమె పేర్కొన్నారు. ఆ గాయం కారణంగా కనీసం కదలలేని స్థితికి చేరుకున్నానని, నరాల సంబంధిత సమస్యలు కూడా తలెత్తాయని ఆమె వివరించారు.ఎంతో చురుకుగా ఉండే తాను, రోజువారీ పనుల కోసం కూడా ఇతరులపై ఆధారపడాల్సి రావడం తనను మానసిక వేదనకు గురిచేసిందని రకుల్ తెలిపారు. "ఇది కేవలం శారీరక గాయమే కాదు, నన్ను మానసికంగానూ ఎంతో కృంగదీసింది" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ఆ క్లిష్ట పరిస్థితుల్లో తన భర్త జాకీ భగ్నానీ తనకు అండగా నిలిచి ఎంతో ధైర్యాన్ని అందించారని ఆమె పేర్కొన్నారు. 2024 ఫిబ్రవరిలో గోవా వేదికగా వివాహం చేసుకున్న ఈ జంట, తమ వైవాహిక బంధానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను ఈ షోలో పంచుకున్నారు.



## 'సత్తెంద్రుడు మారుదు వానిలై'( ఆహా) మూవీ రివ్యూ!



కోలీవుడ్ కథానాయకులలో 'జై' తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్నాడు. తన బాడీ లాంగ్వేజ్ కి తగిన పాత్రలను ఎంచుకుంటూ ముందుకు వెళుతున్నాడు. తమిళంలో ఆయన చేసిన సినిమానే 'సత్తెంద్రుడు మారుదు వానిలై'. మీనాక్షి గోవిందరాజన్ కథానాయికగా నటించిన ఈ సినిమా, ఒక రొమాంటిక్ థ్రిల్లర్. బాబు విజయ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, మే 15వ తేదీన థియేటర్లకు వచ్చింది. ఈ నెల 5వ తేదీ నుంచి 'ఆహా'లో స్ట్రీమింగ్ అవుతోంది. జానకి (మీనాక్షి గోవిందరాజన్) మంచి విద్యావంతురాలు .. అందమైన యువతి. ఆమెపై ఒక రాజకీయనాయకుడి కన్ను పడుతుంది. దాంతో అతను తెలివిగా ఒక పథకం వేస్తాడు. జానకి తండ్రికి కూడా పదవిని కట్టబెట్టి, అందుకు బదులుగా ఆమెను తనకిచ్చి పెళ్లి చేయమని కోరతాడు. అందుకు జానకి తండ్రి సిద్ధమవడంతో, అది ఇష్టం లేని ఆమె ఇల్లొదిలి వెళ్లిపోతుంది. ఆ సమయంలోనే ఆమెకి దగ్గర కావడానికి రణేశ్ ప్రయత్నిస్తూ ఉంటాడు.

## జేడీ చక్రవర్తితో గొడవపై రంభ ఆసక్తికర వ్యాఖ్యలు!



ఒకప్పుడు టాలీవుడ్‌ను తన గ్లామర్, నటనతో ఊపేసిన సీనియర్ నటి రంభ... తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన కో-స్టార్, నటుడు జేడీ చక్రవర్తితో తనకున్న అనుబంధం గురించి పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. 'బొంబాయి ప్రియుడు' సినిమా షూటింగ్ సమయంలో జేడీ చక్రవర్తితో తనకు మంచి స్నేహం ఏర్పడిందని రంభ చెప్పింది. జేడీ ఎప్పుడూ చాలా సరదాగా ఉంటారని, అందరినీ ఎంటర్‌టైన్ చేస్తారని, ఆయనతో గడిపిన సమయం ఎంతో సంతోషాన్ని ఇస్తుందని కొనియాడింది.అయితే, అంతటి ఆత్మీయ స్నేహితుడైన జేడీ చక్రవర్తి... తన పెళ్లికి రాకపోవడం తనను తీవ్రంగా బాధించిందని రంభ ఈ సందర్భంగా వెల్లడించింది. "ఆయన నాకు అంత క్లోజ్ ఫ్రెండ్ అయ్యుండి కూడా నా పెళ్లికి రాలేదు. ఆ సమయంలో నేను చాలా అప్సెట్ అయ్యాను. ఆ తర్వాత ఆయన కనిపించినప్పుడు పెళ్లికి ఎందుకు రాలేదంటూ గట్టిగా తిట్టాను కూడా" అని రంభ నవ్వుతూ పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంది.



# బాక్సాఫీస్ ఛాంపియన్ 'పెద్ది'.. రెండు రోజుల్లో ఎంత వసూల్ చేసిందంటే


-రామ్ చరణ్ 'పెద్ది' చిత్రానికి భారీ వసూళ్లు

-రెండు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ. 181.8 కోట్ల గ్రాస్

-తొలి రోజు రూ. 135.36 కోట్లు రాబట్టిన సినిమా

-వసూళ్ల వివరాలను అధికారికంగా ప్రకటించిన నిర్మాణ సంస్థ

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వచ్చిన 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. ఈ సినిమా విడుదలైన తొలి రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 181.8 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు నిర్మాణ సంస్థ వృద్ధి సినిమాస్ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. తొలి రోజు రూ. 135.36 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ చిత్రం, రెండో రోజు కూడా అదే జోరును కొనసాగించింది. "బాక్సాఫీస్ ఛాంపియన్ పెద్ది థియేటర్లను జయిస్తోంది" అంటూ నిర్మాణ సంస్థ తన పోస్టర్‌లో పేర్కొంది. దేశీయంగానే కాకుండా ఓవర్సీస్‌లోనూ 'పెద్ది' భారీ వసూళ్లు రాబడుతోంది. ముఖ్యంగా నార్త్ అమెరికాలో ఈ చిత్రం ఇప్పటికే 2.2 మిలియన్ డాలర్ల గ్రాస్‌ను కలెక్ట్ చేసి సత్తా చాటింది. ఈ సినిమాలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించగా, కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో కనిపించారు. విశ్వసంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ అందించిన సంగీతం సినిమాకు అదనపు ఆకర్షణగా నిలిచింది.




# నటి అనసూయ కీలక వ్యాఖ్యలు

# సమాజంలోని ఘటనలకు సినిమాలకు లంకె..

-సమాజంలో జరిగే ఘటనలకు సినిమాలను నిందించడం సరికాదన్న అనసూయ

-కథ రాసేవారి నుంచి చూసే ప్రేక్షకుల వరకు అందరికీ బాధ్యత ఉంటుందని వ్యాఖ్య

-క్రియేటివ్ విభేదాల వల్ల కొన్ని అవకాశాలు వదులుకున్నానని వెల్లడి

-సోషల్ మీడియాలో సినీ కంటెంట్‌ను విశ్లేషించడం మంచి పరిణామమని వ్యాఖ్య



సమాజంలో చోటుచేసుకునే ప్రతి సంఘటనకు సినిమాలను కారణంగా చూపడం సరికాదని ప్రముఖ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ అభిప్రాయపడ్డారు. సినిమా ప్రభావం, సామాజిక బాధ్యత అంశాలపై శనివారం ఆమె సోషల్ మీడియా వేదికగా స్పందించారు. సృజనాత్మక స్వేచ్ఛతో పాటు, కంటెంట్ విషయంలో ప్రతి ఒక్కరికీ బాధ్యత ఉండాలని ఆమె గుర్తుచేశారు. సినిమా అనేది ప్రాథమికంగా ఒక కథా రూపమని, అందులోని మంచి చెడులను ప్రేక్షకులు తమ విచక్షణతోనే గ్రహించాలని ఆమె పేర్కొన్నారు. సమాజంలో జరిగే ప్రతికూల పరిణామాలకు సినిమాలనే తప్పుబట్టడం సమంజసం కాదని వ్యాఖ్యానించారు. కంటెంట్ విషయంలో క్రియేటర్లు, దర్శకులు, నటులతో పాటు ప్రేక్షకులకు సైతం సమాన బాధ్యత ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. గతంలో సినిమాల్లో కథానాయకులు స్ఫూర్తిప్రదాతలుగా, ప్రతినాయకులు గుణపాఠంగా ఉండేవారని, కానీ ప్రస్తుతం నాటకీయత కోసం ఆ వ్యత్యాసాన్ని స్పష్టంగా చూపడం లేదని అనసూయ అభిప్రాయపడ్డారు. క్రియేటివ్ అంశాల్లో ఏకీభవించలేక కొన్నిసార్లు తాను అవకాశాలను సైతం వదులుకున్నట్లు ఆమె వెల్లడించారు. సోషల్ మీడియాలో సినిమా కంటెంట్‌ను విశ్లేషించడాన్ని, ప్రశ్నించడాన్ని ఆమె స్వాగతించారు. దీనిని సృజనాత్మకతపై దాడిగా కాకుండా, సమాజంలో పెరుగుతున్న చైతన్యంగా భావించాలని అన్నారు. తన వ్యాఖ్యలు ఎవరినీ వ్యక్తిగతంగా ఉద్దేశించినవి కావని, పరిశ్రమలోని ప్రతి ఒక్కరికీ సామాజిక బాధ్యతను గుర్తు చేయడమే తన అభిమతమని అనసూయ వివరణ ఇచ్చారు.

PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.